గురువారం
14-09-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 85
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మీతో బంధానికి తొలి ప్రాధాన్యతిస్తాం

మాస్కోతో సంబంధాలను మెరుగుపర్చుకోవడానికి ప్యాంగ్యాంగ్ అధిక ప్రాధాన్యత ఇస్తుందని డెమొక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా (డీపీఆర్‌కే) అధినేత కిమ్ జాంగ్ ఉన్ తెలిపారు. రష్యాలోని అమూర్ జిల్లాలోగల వొస్టోచ్నీ స్పేస్ పోర్టును సందర్శించారు.

2 లో

ఉమ్మడి శంఖారావం



చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై

విచారణ 19కి వాయిదా

ఐఆర్ఆర్ కేసులో ముందస్తు బెయిల్‌పైనా అదే రోజు

సీఐడీ కస్టడీ పిటిషన్‌పై స్టే

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు ఈనెల 19వ తేదీకి వాయిదా వేసింది. క్వాష్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలుకు సమయం కావాలని సీఐడీ కోరడంతో అంగీకరించిన హైకోర్టు...తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది. అయితే క్వాష్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా బుధవారం కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. హైకోర్టు నాలుగో నంబర్ కోర్టులో జరిగిన ఈ కేసు విచారణలో భాగంగా న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్‌రెడ్డి ముందుగానే అప్రమత్తమయ్యారు. పిటిషన్ విచారణ చేపట్టకముందే చంద్రబాబు లాయర్లకు ఓ విషయం చెప్పారు. తాను గతంలో ప్రభుత్వ న్యాయవాది(పీపీ)గా పనిచేశానని, అందువల్ల తాను ఈ కేసు విచారణకు అడ్డంకిగా భావిస్తున్నారా, ఏవైనా అభ్యంతరాలు ఉన్నాయా అని అడిగారు. అభ్యంతరాలు ఉంటే ముందే చెప్పాలని, తాను నాట్ బిఫోర్ మీ తీసుకుని ఈ కేసు విచారణను మరో బెంచ్‌కు బదిలీ చేస్తానని స్పష్టం చేశారు. దీనికి సమాధానంగా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా తేల్చిచెప్పేశారు. ఆ తర్వాత విచారణ ప్రారంభించిన జడ్జి శ్రీనివాసరెడ్డి పూర్తి వాదనలు విన్నాకే చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై తీర్పు ప్రకటిస్తానని చెప్పారు. చంద్రబాబుని ఐదు రోజుల కస్టడీ కోరుతూ ఏసీబీ కోర్టులో సీఐడీ పిటిషన్ దాఖలు చేసిన విషయాన్ని సిద్ధార్థ లూథ్రా హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సీఐడీ పిటిషనపై ఎలాంటి విచారణ చేపట్టవద్దని ఉన్నత

- మిగతా 2 లో

13 చోట్ల చంద్రబాబు సంతకాలు 2 లో

న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా ఇండియా కూటమి ముందుకెళుతోంది. బీజేపీని సమష్టిగా ఎదుర్కోవాలని నిర్ణయించుకోవడంతో ఐక్య కార్యాచరణను నిర్దేశించుకునే పనిలో పడింది. 'జుడేగా భారత్, జీతేగా ఇండియా' (భారతదేశం ఏకమవుతుంది, భారతదేశం గెలుస్తుంది) నినాదంతో మోదీ ప్రభుత్వ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ప్రచారం ప్రారంభించాలని నిర్ణయించింది. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్ నుంచి సమరశంఖం పూరించబోతోంది. ఆ రాష్ట్ర రాజధాని భోపాల్‌లో తొలి ఉమ్మడి బహిరంగ సభను అక్టోబరు మొదటివారంలో నిర్వహించనున్నట్లు ఇండియా కూటమి ప్రకటించింది. మధ్యప్రదేశ్ అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. దీంతో తక్షణ కార్యాచరణగా ఉమ్మడి సభ, ర్యాలీకి ప్రతిపక్షాల కూటమి శ్రీకారం చుట్టబోతోంది. అదేవిధంగా దేశవ్యాప్తంగా బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించింది. సాధ్యమైనంత త్వరగా సీట్ల సర్దుబాటు వ్యవహారం తేల్చాలని భావిస్తోంది. ఇండియా కూటమి ప్రతినిధులు ఏయే యాంకర్ల కార్యక్రమాలకు వెళ్లరాదన్నది నిర్ణయించే అధికారాన్ని మీడియా ఉపసంఘానికి కట్టబెడుతూ ఇండియా కూటమి సమన్వయ కమిటీ నిర్ణయం తీసుకుంది. సమన్వయ కమిటీ



తొలిభేటీ ఢిల్లీలోని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ నివాసంలో బుధవారం జరిగింది. అనేక అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది. కులగణనపైనా అంగీకారానికి వచ్చింది. ఇదే విషయాన్ని సమావేశం అనంతరం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విలేకరులతో చెప్పారు. కూటమిలోని పార్టీల నేతలు చర్చించి సీట్లను ఖరారు చేస్తారని తెలిపారు. సీట్ల సర్దుబాటు కోసం అనుసరించే పద్ధతిని నిర్దేశించాలని కూడా కమిటీ నిర్ణయించినట్లు చెప్పారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలతో పాటు వచ్చే ఏడాది జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచారాంశాలు తదితర కీలకాంశాలపై దశలవారీగా చర్చించి సమయానుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని వేణుగోపాల్ అన్నారు. కాగా, సమన్వయ కమిటీలో మొత్తం 14మంది సభ్యులు ఉండగా 12 మంది మాత్రమే మొదటి సమావేశానికి హాజరయ్యారు. బీజేపీ కక్షపూరిత రాజకీయాల కారణంగా ఈడీ ఎదుట హాజరు కావాల్సి ఉండటంతో అభిషేక్ బెనర్జీ (టీఎంసీ)

- భోపాల్‌లో తొలి బహిరంగ సభ
- కులగణనకు అంగీకారం
- త్వరలో సీట్ల సర్దుబాటుపై చర్చలు
- 'ఇండియా' సమన్వయ కమిటీ నిర్ణయాలు

గైర్హాజరైనట్లు వేణుగోపాల్ చెప్పారు. డి.రాజా (సీపీఐ), శరద్ పవార్ (ఎన్సీపీ), కేసీ వేణుగోపాల్ (కాంగ్రెస్), హేమంత్ సోరేన్ (జేఎంఎం), జావేద్ అలీ ఖాన్ (ఎస్పీ), టీఆర్ బాలూ (డీఎంకే), తేజస్వి యాదవ్ (ఆర్జేడీ), రాఘవ్ చద్దా (ఆప్), సంజయ్ ఝా (జేడీయూ), ఒమర్ అబ్దుల్లా (ఎన్సీ), మెహబూబా ముఫ్తీ (పీడీపీ), సంజయ్ రౌత్ (శివసేన (యూబీటీ)) పాల్గొనగా ఈనెల 16,17తేదీల్లో జరబోయే పొలిట్ బ్యూరోలో సీపీఎం తరపు ప్రతినిధి ఖరారు కానున్నారు. ఇదిలావుంటే, ఇండియా కూటమి మొదటిసారి బీహార్ రాజధాని పాట్నాలో సమావేశమైంది. ప్రతి స్థానంలో శక్తిమంతమైన అభ్యర్థిని లోక్‌సభ ఎన్నికల కోసం ఎంపిక చేయాలని నిర్ణయించింది. ముంబైలో జరిగిన మూడో భేటీ తర్వాత సంయుక్త తీర్మానాన్ని

- మిగతా 2 లో

చంద్రబాబు అరెస్టుకు రాజా ఖండన

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడును అరెస్టు చేయటాన్ని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో బుధవారం జరిగిన 'ఇండియా' కూటమి సమన్వయ కమిటీ సమావేశంలో చంద్రబాబు అరెస్టుపై నాయకులు చర్చించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టుపై దేశవ్యాప్తంగా చర్చించుకుంటున్నట్లు చెప్పారు. ఈ అంశాన్ని ఇప్పటికే కొన్ని రాజకీయ పార్టీలు ఖండించాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని, వీటిని మానుకొని విచక్షణతో వ్యవహరించాలని రాజా హితవు పలికారు. తెలుగుదేశం పార్టీ ఏపీలో చేపట్టిన నిరాహార దీక్షలకు సీపీఐ రాష్ట్ర సమితి సంఘీభావం ప్రకటించిందన్నారు.

20న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

అసెంబ్లీ సమావేశాల్లో కీలక నిర్ణయాలపై చర్చ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఈనెల 20వ తేదీ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఏపీ సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు మంత్రివర్గ భేటీ జరగనుంది. ఈ సమావేశంలో కీలక అంశాలపై మంత్రి మండలి చర్చించి నిర్ణయం తీసుకోనుంది. ఈ నెల 21 నుంచి శాసనసభా సమావేశాలు జరగనున్న నేపథ్యంలో కేబినెట్ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం ఈ నెల 21 నుంచి అయిదు రోజుల పాటు సమావేశాలు

- మిగతా 2 లో

జీపీఎస్సే?

- అసెంబ్లీలో బిల్లుకు సిద్ధం
- ప్రభుత్వ మొండి వైఖరి
- పాత పెన్షన్ దూరం
- సీపీఎస్ ఉద్యోగుల్లో ఆందోళన
- ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల్లో వ్యతిరేకత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరిని ప్రదర్శిస్తోంది. ఉద్యోగుల జీవన భద్రతకు భరోసానిచ్చే పాత పెన్షన్‌ను పక్కకు పెట్టేసి గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్)కు ఎలాగైనా చట్టభద్రత తెచ్చేందుకు జగన్ సర్కారు నిమగ్నమైంది. జీపీఎస్ వల్ల పూర్తిగా నష్టం వాటిల్లుతుందని పదేపదే ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నప్పటికీ, సర్కార్ మొండిగా ముందుకెళుతోంది. నాడు పాత పెన్షన్ అమలు చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని, దానిపై రాజస్థాన్, చత్తీస్‌గఢ్, హిమాచల్, పంజాబ్ రాష్ట్రాల నుంచి నివేదికలను రప్పించుకుని వాటిని పక్కన పెట్టింది. దాని స్థానంలో జీపీఎస్‌ను తెరపైకి తెచ్చింది. మంత్రివర్గ ఉప సంఘం, ఉన్నతాధికారులతో అనేక దఫాలుగా జరిగిన సమావేశాల్లో జీపీఎస్‌పై ఏకాభిప్రాయం రాలేదు. సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల వెలగపూడి సచివాలయంలో నిర్వహించిన సమావేశానికి ప్రధాన ఉపాధ్యాయ సంఘాలన్నీ దూరమయ్యాయి. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మాత్రం జీపీఎస్‌లోకి పాత పెన్షన్‌లో ఉన్న ప్రయోజనాలన్నీ తీసుకురావాలని పట్టుపట్టారు. అదే సమావేశంలో అనేక ప్రతిపాదనలను ప్రభుత్వానికి సూచించినా వాటిపై స్పందన లేదు. ఎలాగైనా జీపీఎస్ అమలులోకి తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రాబోయే కేబినెట్ సమావేశంలో దీనిపై ఆమోదముద్ర వేయనుంది. అనంతరం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ప్రభుత్వ వైఖరిని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తూర్పారబడుతున్నాయి.

సీపీఎస్ రద్దు హామీ దగా

గత ఎన్నికల సమయంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే రద్దు చేస్తామని జగన్ హామీ ఇచ్చినప్పటికీ, దానిపై ఇంతవరకు స్పష్టత లేదు. ఇచ్చిన హామీని ఏదొక తరహాగా అమలు చేసి,

- మిగతా 2 లో

ఐదు కొత్త వైద్య కళాశాలలు రెడీ

రేపు ప్రారంభించనున్న సీఎం జగన్

మూడు కళాశాలలు నిర్మించిన ఎంఈఐఎల్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ వైద్య విద్య చరిత్రలో తొలిసారి ఈనెల 15వ తేదీన ఒకేరోజు ఐదు కొత్త వైద్య కళాశాలలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించనున్నారు. వీటిలో విజయనగరం వైద్య కళాశాలను ప్రత్యక్షంగా, నంద్యాల, మచిలీపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం వైద్య కళాశాలలను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలో ఒక వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి, అందులో భాగంగా 17 నూతన వైద్య కళాశాలల స్థాపనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వీటిలో ఐదు కళాశాలలకు భారత వైద్య విద్యామండలి (ఎంసీఐ) నుండి ఈ ఏడాది అనుమతి లభించింది. నీట్ పరీక్ష ద్వారా అర్హత సాధించిన విద్యార్థులను వైద్య కోర్సులో చేర్చుకుని ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించాయి. వైద్యవిద్యను అభ్యసించేందుకు ఒక్కో కళాశాలలో 150 మంది విద్యార్థులు చేరారు. ఇందులో రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం వైద్య కళాశాలల నిర్మాణాన్ని ఎంఈఐఎల్ త్వరితగతిన పూర్తి చేసింది.

పిడుగురాళ్ల, బాపట్ల, మార్కాపురం, మదనపల్లి, అనంతపురం, పెనుగొండ, తిరుపతి, అమలాపురం, పాలకొల్లులో వైద్య కళాశాలలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. రాజమండ్రి మెడికల్ కాలేజీని 3.37 ఎకరాలలో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఎంఈఐఎల్ నిర్మించింది. ఇందులో వైద్య కళాశాల, విద్యార్థులు, సిబ్బందికి వసతి, నర్సింగ్ కళాశాల, ప్రధాన బ్లాకులతో పాటు ప్రయోగశాలలు, లైబ్రరీ గది, లెక్చర్ హాళ్లు, బయోమెడికల్ వేస్ట్ డిస్పోజబుల్ రూమ్, వంటగది, క్యాంటీన్ ఉన్నాయి. అలాగే సముద్రతీరానికి సమీపంలో ఉన్న మచిలీపట్నం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నేరాలే కాదు సార్, ప్రత్యర్థులపై ఘోరాలు కూడా చేస్తాను!

మీడియా ట్రయల్స్ ఆక్షేపణీయం

- పోలీసుల 'మీడియా' సమావేశాలు సరికాదు
- మూడు నెలల్లో మార్గదర్శకాలు రూపొందించండి
- కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: క్రిమినల్ కేసుల దర్యాప్తు సమయంలో పోలీసులు ఏర్పాటు చేసే మీడియా సమావేశాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పక్షపాతంతో కూడిన రిపోర్టింగ్... నిందితుడు నేరం చేశాడనే అనుమానాలకు దారి తీస్తుందని అభిప్రాయపడింది. అందుకే క్రిమినల్ కేసుల విషయంలో పోలీసులు మీడియాకు వెల్లడించే సమయంలో అనుసరించాల్సిన నిబంధనలపై మూడు నెలల్లో సమగ్ర మార్గదర్శకాలు రూపొందించాలని కేంద్ర హోం మంత్రిత్వశాఖను సుప్రీంకోర్టు ఆదేశించింది. దీని రూపకల్పనపై



అన్ని రాష్ట్రాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ)లు నెల రోజుల్లో సూచనలు చేయాలని, అటు జాతీయ మానవ హక్కుల కమిషన్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. క్రిమినల్ కేసులు దర్యాప్తు జరుగుతోన్న సమయంలో పోలీసులు అనుసరిస్తోన్న విధివిధానాలకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఈ సమయంలో ధర్మాసనం అనేక ప్రశ్నలు లేవనెత్తింది. ఎన్‌కౌంటర్ల విషయంలో 'పీయూసీఎల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర' కేసులో స్పష్టత వచ్చినప్పటికీ, మీడియా సమావేశాలపై స్పష్టతరాలేదు. ఇదే విషయాన్ని సుప్రీం ధర్మాసనం తాజాగా ప్రస్తావించింది. ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టింగ్ విస్తరణ పెరుగుతోన్నందున ఈ అంశం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని పేర్కొంది. ముఖ్యంగా ప్రజాప్రయోజనాలకు సంబంధించి ఇందులో ఎన్నో అంశాలు ఇమిడి ఉన్నాయని తెలిపింది. దర్యాప్తు విషయాలు ప్రజలు తెలుసుకునే హక్కు, పోలీసులు వెల్లడించే అంశాల దర్యాప్తుపై ప్రభావం, నిందితుల గోప్యత.. ఇలా మొత్తంగా న్యాయవ్యవస్థపై ప్రభావం వంటి అంశాలతో ముడిపడి ఉందని తెలిపింది. కొన్నేళ్లుగా క్రిమినల్ కేసుల్లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా

- మిగతా 2 లో

17న అఖిలపక్షం

ఆహ్వానం పంపిన కేంద్రం

అజెండా ఇద్దరికే తెలుసు: కాంగ్రెస్, టీఎంసీ

అధికార పక్ష వైఖరిని దుయ్యబట్టిన ప్రతిపక్ష పార్టీలు

న్యూఢిల్లీ: కేంద్రంలో మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం తన నిరంకుశ, ఏకపక్ష వైఖరిని కొనసాగిస్తోంది. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం... ఇప్పటివరకు దాని అజెండా గురించి ప్రస్తావించకపోవడంపై ప్రతిపక్ష పార్టీలు తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నాయి. కేవలం ప్రత్యేక సమావేశాలకు ఒకరోజు ముందు 'అఖిలపక్ష సమావేశం' నిర్వహించనున్నట్లు బుధవారం ప్రకటించింది. దీంతో ప్రభుత్వం తీరును విపక్షాలు దుయ్యబడుతున్నాయి. పార్లమెంటు



ప్రత్యేక ప్రారంభానికి కొద్ది రోజులే మిగిలి ఉండగానే దానిపై అజెండా గురించి 'ఇద్దరికి మాత్రమే' తెలుసని ప్రతిపక్ష నేతలు ప్రభుత్వంపై

- మిగతా 2 లో

సాధారణ సమావేశమే: రాజా 2 లో

6 వేలకు లిబియా వరద మృతులు

కొనసాగుతున్న సహాయక చర్యలు

సముద్రం నుంచి కొట్టుకొస్తున్న మృతదేహాలు

ట్రిపోలి: లిబియాలో జల ప్రళయం ఆరు వేల మంది ప్రాణాలు తీసింది. ఎడతెరిపి లేని భారీ వర్షాలు, ఆకస్మిక వరదులకు కొన్ని వేల మంది గల్లంతయ్యారు. వీరి సంఖ్య పదివేలకుపైగానే ఉంటుందని అధికారులు అంటున్నారు. మరోవైపు మృతుల సంఖ్య భారీగా పెరిగింది. ఒక్క డెర్నా నగరంలోనే 5,300 మృతదేహాలు లెక్క తేలాయి. సంఖ్య రెడింతలు పెరిగవచ్చని తూర్పు లిబియా అధికారులు తెలిపారు. సముద్రం నుంచి మృతదేహాల కుప్పలు కొట్టుకొస్తున్నట్లు పౌర విమానయాన శాఖ మంత్రి హిచెమ్ చికౌట్ తెలిపారు. లిబియాకు ఆపన్నహస్తం అందించాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. డెర్నా నగరం లక్ష మందికి ఇల్లు కాగా అదిప్పుడు శవాల దిబ్బగా మారిందని అధికారులు చెప్పారు. వరద తాకిడికి బహుళ అంతస్తుల భవనాలు, రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయని తెలిపారు. 60వేల మంది నిరాశ్రయులైనట్లు పేర్కొన్నారు. కాగా, మంగళవారం సుమారు వెయ్యి మందిని ఖననం చేసినట్లు వెల్లడించారు. లిబియాలోని నేషనల్ ఆయిల్ కార్పొరేషన్‌కు గరిష్ఠస్థాయి ప్రమాద హెచ్చరికలు జారీ అయ్యాయి. ఉత్పత్తి కేంద్రాల నుంచి అన్ని రాకపోకలు, కార్యకర్తలపాలు నిలిచిపోయాయి. లిబియాలో ఘర్షణాత్మక వాతావరణం వల్ల దాదాపు 50వేల మంది నిరాశ్రయులు కాగా ప్రస్తుతం ఆ సంఖ్య 60వేలకుపైగానే ఉంటుందన్నది ప్రాథమిక అంచనా అని యూఎన్‌హెచ్‌సీఆర్ అధికార ప్రతినిధి రూలా అమీన్ తెలిపారు. వరద పీడిత ప్రాంతాలకు చేరుకునేందుకు ఇబ్బంది కలుగుస్తోందని, రవాణా, టెలి కమ్యూనికేషన్ వ్యవస్థ ధ్వంసమయ్యాయని చెప్పారు. ఆసుపత్రుల్లో పరిస్థితులు దయనీయంగా మారాయని, సహాయ సహకారాలను కొనసాగించడం కష్టసాధ్యంగా మారిందని ఆమె చెప్పారు.

17న అఖిలపక్షం

(మొదటిపేజీ తరువాయి)

మండిపడ్డారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కావడానికి ఒకరోజు ముందు అంటే సెప్టెంబరు 17న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఈ విషయాన్ని ప్రకటిస్తూ, ఈ సమావేశానికి హాజరుకావాలని ప్రతిపక్ష పార్టీల నేతలందరికీ ఈ-మెయిల్ ద్వారా ఆహ్వానాలు పంపినట్లు తెలిపారు. 'ఈ నెల 18 నుంచి పార్లమెంటు సమావేశాలు జరగనున్న నేపథ్యంలో 17వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు అఖిలపక్ష ఫ్లోర్ లీడర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానాన్ని సంబంధిత నేతలకు ఈ-మెయిల్ ద్వారా పంపారు' అని జోషి సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. సెప్టెంబరు 18 నుంచి 22 వరకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఆగస్టు 31న జోషి ప్రకటించారు. అయితే ఈ సమావేశాల అజెండా ఏమిటనే దానిపై అనేక ఊహాగానాలకు దారితీసింది. ఇదిలాఉండగా, పార్లమెంటు ఉభయ సభల సమావేశాలు ప్రశ్నోత్తరాల సమయం లేదా ప్రైవేట్ సభ్యుల పని లేకుండా జరుగుతాయని లోక్‌సభ, రాజ్యసభ సెక్రటేరియట్‌లు సెప్టెంబరు 2న తెలిపాయి. ఈ సమావేశాలు ఐదు రోజులు కొనసాగుతాయని, తాత్కాలిక క్యాలెండర్ గురించి సభ్యులకు ప్రత్యేకంగా తెలియజేయాలని సచివాలయాలు తెలిపాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, పాత పార్లమెంటు భవనంలో సమావేశాలు ప్రారంభమవుతాయి. మరుసటి రోజు కొత్త పార్లమెంటు భవనానికి మారుతాయి. కొత్త పార్లమెంటు భవనానికి మారడం సెప్టెంబరు 19న గణేష్ చతుర్థి రోజు అవుతుంది. ఇది కొత్త ప్రారంభానికి శుభప్రదంగా పరిగణిస్తున్నారు. రాబోయే సమావేశాల్లో ఇండియా పేరును భారత్‌గా పేరు మార్చే తీర్మానాన్ని ప్రభుత్వం తీసుకురావచ్చు. భారత రాజ్యాంగం ప్రస్తుతం దేశాన్ని 'ఇండియా... అది భారత్...' అని సూచిస్తోంది. అయితే దీనిని కేవలం 'భారత్'గా సవరించాలనే పిలుపు పెరుగుతోంది.

అజెండాపై నోరుమెదపరేం? : టీఎంసీ

పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నిర్వహణకు రెండు రోజులే మిగిలి ఉన్నప్పటికీ 'అజెండాపై ఒక్క మాట కూడా వెల్లడించలేదు' అని టీఎంసీ సీనియర్ నాయకుడు డెరెక్ ఓబ్రెయిన్ బుధవారం కేంద్రంపై దాడి చేశారు. సెప్టెంబరు 18 నుంచి 22 వరకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేశారు. 'పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభమవడానికి ఇంకా రెండు పని దినాలు మిగిలి ఉన్నాయి. ఇంకా అజెండా గురించి ఒక్క మాట కూడా లేదు. ఇద్దరికి మాత్రమే తెలుసు!. మనం ఇప్పటికీ మనల్ని పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అని పిలుచుకుంటున్నాము' అని టీఎంసీ రాజ్యసభ పార్టీ నాయకుడు డెరెక్ ఓబ్రెయిన్ గతంలో ట్విట్టర్‌గా ఉన్న 'ఎక్స్' లో పోస్టు చేశారు. కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ కూడా ఎటువంటి అజెండాను ప్రకటించనందుకు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 'ఈ రోజు సెప్టెంబరు 13. ఐదు రోజులపాటు కొనసాగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఐదు రోజుల తర్వాత నుంచి ప్రారంభమవుతాయి. ఎవరో ఒక వ్యక్తి తప్ప (సరే, బహుశా మరొకరు కూడా) అజెండా గురించి ఏదైనా తెలిసి ఉంటారు' అని ఎద్దేవా చేశారు. గతంలో జరిగిన సభ ప్రత్యేక సమావేశాల జాబితాను అజెండాలతో ఆయన పోస్టులో పేర్కొన్నారు. నవంబరు 26, 2019న రాజ్యాంగం 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సెంట్రల్ హాల్‌లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించినట్లు ఆయన చెప్పారు. జీఎస్‌టీని అమలు చేయడానికి జూన్ 30, 2017 అర్ధరాత్రి సెంట్రల్ హాల్‌లో ప్రత్యేక సమావేశం జరిగిందన్నారు. అలాగే, 2015 నవంబరు 26, 27 తేదీల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక సమావేశాలను నిర్వహించినట్లు రమేశ్ ప్రస్తావించారు. 'మే 13, 2012 రాజ్యసభ, లోక్‌సభ మొదటి సమావేశాల 60వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక సమావేశం. జులై 22, 2008 వామపక్షాలు యూపీఏ-1 ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్న తర్వాత విశ్వాస ఓటు కోసం లోక్‌సభ ప్రత్యేక సమావేశం' అని ఆయన పోస్ట్‌లో పేర్కొన్నారు. అదేవిధంగా 1997 ఆగస్టు 26 నుంచి సెప్టెంబరు 1 వరకు భారత స్వాతంత్ర్య 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. జూన్ 3 నుంచి 4, 1991 వరకు ఆర్టికల్ 356 (3) ప్రకారం హరియానాలో రాష్ట్రపతి పాలన ఆమోదం కోసం రాజ్యసభ ప్రత్యేక సమావేశం (158వ సమావేశం) జరిగిందని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 1, 1977 వరకు ఆర్టికల్ 356 (4) రెండవ నిబంధన ప్రకారం తమిళనాడు, నాగాలాండ్‌లలో రాష్ట్రపతి పాలన పొడిగింపు కోసం రెండు రోజుల పాటు రాజ్యసభ ప్రత్యేక సమావేశం జరిగిందని జైరాం రమేశ్ వెల్లడించారు. సెప్టెంబరు 18 నుంచి ప్రారంభమయ్యే ఐదు రోజుల ప్రత్యేక సమావేశాల అజెండాను వెల్లడించనందుకు కాంగ్రెస్ పదేపదే ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంది. గతంలో జరిగిన ప్రతి ప్రత్యేక సమావేశాల అజెండా ముందుగానే తెలుసని, పార్లమెంటు సమావేశాలను వక్రీకరించేది కేవలం మోదీ ప్రభుత్వమేనని జైరాం రమేశ్ గతంలో ఆరోపించారు.

సాధారణ సమావేశమే: రాజా

న్యూదిల్లీ: పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో కేంద్రం ప్రభుత్వం ఈనెల 17న ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశం సాధారణమైనదేనని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. బుధవారం ఏఎన్‌ఐతో రాజా మాట్లాడుతూ 'అది పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ఏర్పాటు చేసే ఒక సాధారణ సమావేశమే. అయితే పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసే ముందు ప్రభుత్వం ఉభయసభల్లోని ప్రతిపక్ష నాయకులను సంప్రదించి ఉండాల్సింది' అని అన్నారు. 'ప్రత్యేక సమావేశ అజెండా ఏమిటో ఎవరికీ తెలియదు. చర్చించే అంశాలు ఏమిటి?' అని ఆయన ప్రశ్నించారు.

జీపీఎస్సే?

(మొదటిపేజీ తరువాయి)

సీపీఎస్ ఉద్యోగులను మభ్యపెట్టేందుకుగాను తెరపైకి జీపీఎస్ విధానాన్ని వ్యూహాత్మకంగా తీసుకొచ్చారు. నాలుగున్నరేళ్ల నుంచి సీపీఎస్ రద్దు కోసం రాష్ట్రంలో అనేక ఉద్యమాలు కొనసాగాయి. సీఎం జగన్ నివాసం ముట్టడికి సైతం సీపీఎస్ ఉద్యోగ సంఘాలు ప్రయత్నించాయి. వాటికి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు సంఘీభావం ప్రకటించాయి. విజయవాడ కేంద్రంగా ఉద్యమాలను నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. ఈ సీపీఎస్ ఉద్యమాలపై స్పందించకుండా, వారి ఉద్యమాల అణచివేసే చర్యలకు జగన్ సర్కార్ దిగుతోంది. కొంతమంది ఉద్యమకారులపై కక్ష గట్టి కేసులు నమోదు చేస్తోందనే విమర్శలున్నాయి. ఎలాగైనా సీపీఎస్ రద్దు ఉద్యమాన్ని నీరుగార్చి, జీపీఎస్‌ను అమలు చేస్తుందనే విమర్శలున్నాయి. ఈ చర్యలను ఉపాధ్యాయ సంఘాలు పూర్తిగా వ్యతిరేకిస్తుండగా, ఉద్యోగ సంఘాల్లో మాత్రం భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉద్యోగ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి జీపీఎస్‌ను వ్యతిరేకించాల్సిన అవసరం ఉంది.

జీపీఎస్‌తో అంతా నష్టమే

జీపీఎస్‌తో ఉపాధ్యాయ, ఉద్యోగులకు అంతా నష్టమే వాటిల్లనుంది. ఓపీఎస్‌లో ఉన్న ప్రయోజనాలన్నీ జీపీఎస్‌లోకి తీసుకురావాల్సిందేనని కొన్ని ఉద్యోగ సంఘాలు పట్టుపడుతున్నాయి. ఉపాధ్యాయ సంఘాలు మాత్రం పాత పెన్షన్ విధానమే తీసుకు రావాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇదే విధానంలో సీపీఎస్ ఉద్యోగులు ఉన్నారు. సీపీఎస్, జీపీఎస్ రెండింటిలోనూ ఉద్యోగుల కాంట్రిబ్యూషన్, షేర్ మార్కెట్ ఉన్నాయని, వాటివల్ల నష్టం వాటిల్లుతుందని చెబుతున్నాయి. కేవలం ఐదేళ్లపాటు ప్రజాప్రతినిధిగా ఎన్నికయిన వారికి జీవితాంతం పెన్షన్ తీసుకునే వెసులుబాటు ఉంటోందని, అదే 30 ఏళ్ల పాటు ప్రజలకు సేవ చేసిన ఉద్యోగులకు పెన్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జగన్ సర్కారు స్పందించి ఇచ్చిన హామీ మేరకు రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో పాత పెన్షన్‌ను పునరుద్ధరిస్తూ చట్టం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. లేకుంటే లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలతో కలిపి ఐక్య ఉద్యమాలకు సన్నద్ధమవుతామని హెచ్చరిస్తున్నాయి.

ఉమ్మడి శంఖారావం

(మొదటిపేజీ తరువాయి)

వెలువరించింది. సాధ్యమైనంత వరకు ఉమ్మడిగానే ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించింది. వేర్వేరు రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాట్లకు తక్షణమే చర్యలు చేపడతామని, సాధ్యమైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని కూటమి వెల్లడించింది. మహారాష్ట్ర, తమిళనాడు, బీహార్ వంటి రాష్ట్రాల్లో సీట్ల విషయంలో అవగాహన కుదిరినట్లు ప్రతిపక్ష నేతలు కొందరు చెప్పారు. ఢిల్లీ, పంజాబ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాటు సవాల్‌గా మారిందని అన్నారు. రాబోయే రోజుల్లో నిర్వహించే ర్యాలీలు, ప్రచారంలో ప్రస్తావించాల్సిన అంశాలు తదితరాలపైనా నేతలు నిర్ణయిస్తున్నారు. 28 పార్టీలు 'ఇండియా' కూటమిగా ఏకతాటిపైకి వచ్చాయి. భారతీయ జనాభాలో 60 శాతానికి ఇండియా కూటమి ప్రాతినిధ్యం వహిస్తోందని, సమిష్టిగా బీజేపీ గద్దె దించగలమని కూటమి నేతలు ధీమాగా చెబుతున్నారు.

20న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

జరగనున్నాయి. అవసరమైతే మరో రెండు రోజులు పెంచే అవకాశం ఉంది. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ బిల్లును ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం తీసుకురావాలనుకుంటున్న జీపీఎస్ సంబంధిత బిల్లు కూడా ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ప్రభుత్వం రూపొందించిన ప్రతిపాదనపై ఉద్యోగులు ఇటీవల సమావేశంలో కొన్ని మార్పులు కోరారు. సీఎం నిర్ణయాన్ని బట్టి మంత్రివర్గ ఉప సంఘం ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో మరోసారి భేటీ అయి వీటిని ఖరారు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియను వెంటనే పూర్తి చేస్తే ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టడం ఖాయంగానే కనిపిస్తోంది. ఇవే కాకుండా కొన్ని ఆర్డినెన్సులకు సంబంధించిన బిల్లులు, మరికొన్ని కొత్త బిల్లులను సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. అలాగే ఈనెల 19 నుంచి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే కీలక నిర్ణయాలకనుగుణంగా ఏపీ అసెంబ్లీ అనుసరించే అవకాశం ఉందని వైసీపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

విచారణ 19కి వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

న్యాయస్థానం ఆదేశించింది. రాజధాని ఇన్నర్‌రింగ్ రోడ్డు వ్యవహారంలో ముందస్తు బెయిల్ కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను కూడా ఈనెల 19వ తేదీకి వాయిదా వేసింది.

చంద్రబాబుని కలిసిన సిద్ధార్థ లూథ్రా

రాజమండ్రి సెంట్రల్ జైలులో టీడీపీ అధినేత చంద్రబాబుని ఆయన తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా బుధవారం కలిశారు. 45 నిమిషాల పాటు చంద్రబాబుతో భేటీ అయిన న్యాయవాది...కేసుకు సంబంధించిన పరిణామాలను వివరించారు. అనంతరం నారా లోకేశ్ క్యాంప్ సైట్‌కు వెళ్లారు. చంద్రబాబుతో సమావేశమైన వివరాలతో పాటు లీగల్ పరంగా తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. చంద్రబాబు కుటుంబ సభ్యులతో, పార్టీ ముఖ్య నేతలతో కూడా సిద్ధార్థ లూథ్రా చర్చలు జరిపారు.

చంద్రబాబు ఎప్పుడూ తప్పుచేయరు

అక్రమ కేసులు ఆయనను ఏమీ చేయలేవు

లోకేశ్‌కు ఫోన్ చేసి ధైర్యం చెప్పిన సినీనటుడు రజనీకాంత్



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుని అరెస్ట్ చేయడంపై ప్రముఖ సినీ నటుడు రజనీకాంత్ స్పందించారు. ఆయన బుధవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు ఫోన్ చేసి ధైర్యం చెప్పారు. తన ఆత్మీయ మిత్రుడైన చంద్రబాబు గొప్ప పోరాట యోధుడని, ఆయన ఎప్పుడూ తప్పు చేయరు. ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, మంచి పనులే కాపాడతాయి. తప్పుడు కేసులు, అక్రమ అరెస్ట్‌లు ఆయనను ఏమీ చేయలేవు. చేసిన మంచి పనులు, ప్రజాసేవే ఆయనను బయటకు తీసుకొస్తాయని లోకేశ్‌కు ధైర్యం చెప్పారు.

చంద్రబాబుని అరెస్ట్ చేసిన వారికి శిక్ష తప్పదు : అశ్వనీదత్

చంద్రబాబు అరెస్ట్‌ను ప్రముఖ సినీ నిర్మాత అశ్వనీదత్ తీవ్రంగా ఖండించారు. అన్యాయంగా ఆయనను అరెస్ట్ చేసిన వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. ది గ్రేట్ చంద్రబాబు నాయుడుని అక్రమ కేసులో ఇరికించినవారికి పుట్టగతులుండవని శపించారు. దీనికి పరిష్కారం త్వరలోనే ఉంది. మూడు, నాలుగు నెలల్లో ఎన్నికలు రాగానే వారు శిక్ష తప్పక అనుభవిస్తారు. రాష్ట్రంలోని 175 సీట్లలో 160 సీట్లు చంద్రబాబు కచ్చితంగా గెలుస్తారని అశ్వనీదత్ స్పష్టం చేశారు.

మీతో బంధానికి తొలి ప్రాధాన్యతిస్తాం

రష్యా పర్యటనలో కిమ్ - పుతిన్‌తో భేటీ

వొటోచ్నీ స్పేస్ పోర్టు సందర్శన

వ్లాడివోస్టోక్: మాస్కోతో సంబంధాలను మెరుగుపర్చుకోవడానికి ప్యాంగ్యాంగ్ అధిక ప్రాధాన్యత ఇస్తుందని డెమొక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా (డీపీఆర్‌కే) అధినేత కిమ్ జాంగ్ ఉన్ తెలిపారు. రష్యాలోని అమూర్ జిల్లాలోగల వొటోచ్నీ స్పేస్ పోర్టును సందర్శించారు. అక్కడే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు కరచాలనం చేసి పలకరించుకున్నారు. అనంతరం కిమ్ మాట్లాడుతూ రష్యన్ ఫెడరేషన్‌తో సంబంధాలకు డీపీఆర్‌కే అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. తమ బంధం మరింత బలోపేతం అయ్యేందుకు ద్వైపాక్షిక చర్చలు దోహదమవుతాయన్న విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. రష్యాకు ఆహ్వానించినందుకు పుతిన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కీలక సమయంలో ఈ భేటీ జరుగుతోందని అన్నారు. రష్యా గడ్డపై అడుగు పెట్టినప్పటి నుంచి రష్యన్ల ఆత్మీయతను అనుభవం చేశామన్నారు. డీపీఆర్‌కే తరపున పుతిన్‌కు, రష్యాన్ ప్రజలకు అభినందనలు తెలిపారు. పుతిన్ మాట్లాడుతూ రాకెట్ టెక్నాలజీపై డీపీఆర్‌కే అధినేత అమితాసక్తిని కనబర్చారని అన్నారు. అంతరిక్ష రంగంలో తమదైన ముద్ర వేసే ప్రయత్నంలో ఉన్నారన్నారు. స్పేస్ రాకెట్ సోయుజ్-2 సంబంధిత ఇంజినీరింగ్ కాంప్లెక్స్, మొదటి అంతస్తులో అధినేతలు సమావేశమయ్యారు. ద్వైపాక్షిక అంశాలతో పాటు సహకారం, వాణిజ్యం, ఆర్థిక - సాంస్కృతిక సంబంధాలు, ప్రాదేశిక, అంతర్జాతీయ అంశాలపై చర్చించారు. అంతర్జాతీయ ఆంక్షలను అతిక్రమించేలా ఆయుధ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఉత్తర కొరియా నుంచి యాంటీ ట్యాంక్ మిసైళ్లు, తూటాలను రష్యా కోరుతుండగా అందుకు బదులుగా అత్యాధునిక క్షిపణి, అణు జలాంతర్గామి పరిజ్ఞానాన్ని ఆ దేశం ఇవ్వాలంటోందని నిపుణులు వెల్లడించారు.

రెండు బాలిస్టిక్ క్షిపణులు పరీక్షించిన ఉ.కొరియా

సియోల్: దగ్గర లక్ష్యాలు ఛేదించే రెండు బాలిస్టిక్ క్షిపణులను ఉత్తర కొరియా బుధవారం పరీక్షించింది. ప్యాంగ్యాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్దనున్న సునన్ నుంచి 10 నిమిషాల తేడాతో రెండు క్షిపణులను ప్రయోగించినట్లు దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఓ ప్రకటన వెలువరించింది. ఈ క్షిపణులు దేశ తూర్పు సముద్రాల వైపుకు దూసుకెళ్లాయని, మొదటి క్షిపణిని ఉదయం 11.43 గంటలకు రెండవది 11.53 గంటలకు పరీక్షించినట్లు పేర్కొంది. అయితే అవి ఎంతదూరం ప్రయాణించాయో చెప్పలేకపోయింది. అమెరికాతో కలిసి పూర్తి సన్నద్ధంగా తమ సైన్యం ఉన్నట్లు దక్షిణ కొరియా అధికారిక ప్రకటన వెలువరించింది. భవిష్యత్ ప్రయోగాల దృష్ట్యా అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపింది. ఉత్తర కొరియా ప్రయోగించిన క్షిపణులు తమ ఎకనమిక్ జోన్ అవతల పడినట్లు జపాన్ ప్రభుత్వ ప్రధాన అధికార ప్రతినిధి హిరోకాజు మత్సునో తెలిపారు.

ఐదు కొత్త వైద్య కళాశాలలు రెడీ

(మొదటిపేజీ తరువాయి)

మెడికల్ కాలేజీ 64.38 ఎకరాల్లో విస్తరించి ఉంది. 13 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలను చేపట్టింది. సముద్రతీర ప్రాంతంలో ఉన్నందున నేల స్వభావం దృష్ట్యా నిర్మాణాలు పటిష్టంగా ఉండేలా బలమైన పునాదుల కోసం జియోటెక్స్‌టైల్, జియో-గ్రిడ్, గ్రాన్యులర్ సబ్-బేస్ వంటి వినూత్న పద్ధతులను ఎంఈఐఎల్ ఉపయోగించింది. నిర్మాణాన్ని మరింత సులభతరం చేయడానికి, ఉప్పులేని నీటిని నిల్వ చేయడానికి జియో మెమోరియల్ షీట్ల సహాయంతో 1.15 కోట్ల లీటర్ల సామర్థ్యం గల ప్రత్యేక నీటి నిల్వ ట్యాంక్‌ను నిర్మించింది. ఇక్కడ రోజువారీ నిర్మాణ పనులకు దాదాపు 50 వేల లీటర్ల నీరు అవసరం కాగా, ఇన్-పేషెంట్ డిపార్ట్‌మెంట్, అవుట్-పేషెంట్ డిపార్ట్‌మెంట్, డయాగ్నస్టిక్ బ్లాక్, మెడికల్ కాలేజీ మొదలైన నిర్మాణాలు ఇప్పటికే పూర్తికాగా మరికొన్ని పనులు కొనసాగుతున్నాయి.

ఏలూరు వైద్య కళాశాలకు సంబంధించి 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక వైద్య కళాశాల, 24/7 అక్యూట్ కేర్ బ్లాక్, మాతాశిశు సంరక్షణ భవనం, హాస్టళ్లు, స్టాఫ్ క్వార్టర్లు, రోగులు, సహాయకుల వసతి గృహం, క్యాంటీన్ల విస్తరణ వంటివి ఎంఈఐఎల్ చేపట్టి ఐదు కీలక బ్లాకుల పనులను అత్యంత వేగవంతంగా అందుబాటులోకి తీసుకొచ్చింది.

మీడియా ట్రయల్స్ ఆక్షేపణీయం

(మొదటిపేజీ తరువాయి)

రిపోర్టింగ్ గణనీయంగా పెరిగిన దృష్ట్యా గతంలో రూపొందించిన (2010లో) నిబంధనలను ఆధునీకరించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. మీడియాకు వెల్లడించే సమాచారం పరిస్థితులకు అనుగుణంగా నిర్దిష్టంగా ఉండాలని, బాధితుల వయసు, లింగంతోపాటు నిందితుల గోప్యతను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. పోలీసులు వెల్లడించే సమాచారం 'మీడియా ట్రయల్స్'కు దారితీయకుండా ఉండాలని సుప్రీం ధర్మాసనం తెలిపింది. తదుపరి విచారణ జనవరి రెండో వారానికి వాయిదా వేసింది. విచారణలో భాగంగా కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భారతి వాదనలు వినిపించారు. పోలీసులు చేసే మీడియా ప్రకటనలకు సంబంధించి మార్గదర్శకాలు రూపొందిస్తామని, దాని గురించి న్యాయస్థానానికి ప్రభుత్వం తెలియజేస్తుందని తెలిపారు. బాధితుడు ముఖ్యంగా మైనర్ విషయంలో గోప్యతపై దృష్టి పెట్టాలని, దానికి విఘాతం కలిగించరాదన్న అంశాన్ని గమనంలో ఉంచుకోవాలని న్యాయస్థానం నొక్కిచెప్పింది. మీడియా ప్రకటనలపై పోలీసులకు శిక్షణ ఎలా ఉండాలి? గత సూచనలపై కేంద్రం తీసుకున్న చర్యలేమిటి? అని ధర్మాసనం ప్రశ్నించింది. దీనికి సీనియర్ న్యాయవాది, అమికస్ క్యూరీ గోపాల్ శంకరనారాయణ స్పందిస్తూ వార్తలు ఇవ్వకుండా మీడియాను ఆపలేముగానీ పోలీసులు సున్నితంగా వ్యవహరించడం అవసరమని అన్నారు.

13 చోట్ల చంద్రబాబు సంతకాలు

కేబినెట్ అనుమతి లేకుండా 'స్కిల్'

నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేషన్

గంటా సుబ్బారావుకు మూడు బాధ్యతలు

మీడియాతో ఏపీ సీఐడీ చీఫ్ సంజయ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : కేబినెట్ అనుమతి లేకుండానే స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారని, జీవోల్లో 13 చోట్ల చంద్రబాబు నాయుడు స్వహస్తాలతో చేసిన సంతకాలున్నాయని ఏపీ సీఐడీ చీఫ్ సంజయ్ వెల్లడించారు. కార్పొరేషన్ ఏర్పాటులోనూ విధి విధానాలను పాటించలేదన్నారు. మంగళగిరిలోని ఏపీ సీఐడీ కార్యాలయంలో బుధవారం అధికారులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పేరుతో షెల్ కంపెనీల ద్వారా ప్రజా ధనాన్ని మళ్లించిన విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బడ్జెట్ అనుమతి పైనా చంద్రబాబు సంతకం ఉందని స్పష్టం చేశారు. ఒక ప్రైవేట్ వ్యక్తి గంటా సుబ్బారావుకు మూడు బాధ్యతలు అప్పగించారని, ఆయన్ని నేరుగా ఈ డిపార్ట్‌మెంట్ ద్వారా చంద్రబాబుతో సంప్రదింపులు చేసేలా ప్రణాళిక చేశారని చెప్పారు. రూ.313 కోట్లలో రూ.241 కోట్లు ఒక షెల్ కంపెనీకి వెళ్లాయని వివరించారు. ఈ కుంభకోణంలో ఇప్పటివరకు ఈడీ దాదాపు రూ.32 కోట్లు వసూలు చేసిందన్నారు. సీమెన్స్ తెచ్చి స్కిల్ సెంటర్లు పెట్టాలనేదీ ఒప్పందంలో లేదని, ఆ ఒప్పందం దురుద్దేశపూర్వకంగా చేసుకున్నారని తెలిపారు. ఆరు చోట్ల క్లస్టర్లు పెట్టాలనుకున్నారుగానీ ఎక్కడా పెట్టలేదని చెప్పారు. స్కిల్ సెంటర్లు ఎక్కడ పెట్టాలనేదీ తేల్చుకోక ముందే ప్రభుత్వ ప్రజా ధనం చేతులు మారిందన్నారు. డిజైన్ టెక్ ఎండీ ఖన్వేల్కర్ రెండు నెలలు జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారని అన్నారు. సీమెన్స్ కంపెనీ ట్రైనింగ్ మాడ్యూల్స్ డిస్కౌంట్ ఇస్తామని చెప్పారుగానీ, ఎక్కడా డబ్బులు పెడతామని చెప్పలేదని వివరించారు.

75 లక్షల గ్యాస్ కనెక్షన్లు

- రూ.7,210 కోట్లతో ఈ-కోర్టుల ప్రాజెక్టు మూడో దశ
- సువెన్ ఫార్మాలోకి రూ.9,589 కోట్ల ఎఫ్‌డీఐ
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ: జీ20 శిఖరాగ్ర సదస్సు విజయవంతం కావడంతో ప్రధాని నరేంద్ర మోదీకి అభినందనలు తెలుపుతూ కేంద్ర కేబినెట్ బుధవారం తీర్మానం చేసింది. అలాగే 75 లక్షల ఎల్పీజీ కనెక్షన్లకు మూడేళ్లలో రూ.1,650 కోట్లు విడుదల చేయడానికి ఆమోదం తెలిపింది. మరో రూ.7,210 కోట్లతో నాలుగేళ్లలో ఈ-కోర్టుల ప్రాజెక్టు మూడో దశ అమలునకూ ఆమోదముద్ర వేసింది. సైప్రస్‌కు చెందిన సంస్థ ద్వారా సువెన్ ఫార్మాలో రూ.9,589 కోట్ల ఎఫ్‌డీఐకీ అంగీకారం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ బుధవారం సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద 9.60 కోట్ల ఎల్పీజీ సిలిండర్లు ఇస్తుండగా మరో 75 లక్షల ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చేందుకు మూడేళ్లలో రూ.1,650 కోట్లను విడుదల చేయడానికి కేబినెట్ అంగీకరించిందని చెప్పారు. ఈ నిర్ణయంతో లబ్ధిదారుల సంఖ్య 10.35కోట్లకు పెరుగుతుందన్నారు. అదే సమయంలో రూ.7,210 కోట్లతో నాలుగేళ్లలో ఈ-కోర్టుల ప్రాజెక్టు ఫేజ్-3 అమలు చేయనున్నట్లు చెప్పారు. 'మూడో దశలో భాగంగా ఎక్కువ కేసుల పరిష్కారం, ఆన్‌లైన్, కాగితరహిత కోర్టుల ద్వారా రికార్డుల డిజటలీకరణ, ఈ-ఫైలింగ్/ ఈ-చెల్లింపుల విశ్వజనీకరణకు కసరత్తు జరుగుతుంది. న్యాయ వ్యవస్థ కోసం ఏకీకృత సాంకేతిక పరిజ్ఞాన వేదికను సృష్టించడమే మూడో దశ ముఖ్య ఉద్దేశం' అని అనురాగ్ ఠాకూర్ తెలిపారు. సైప్రెస్‌కు చెందిన బెర్హయాండా లిమిటెడ్ ద్వారా సువెన్ ఫార్మాలో రూ.9,589 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి(ఎఫ్‌డీఐ)కి కేబినెట్ అంగీకరించింది. ప్రమోటర్ భాగస్వాములు, పబ్లిక్ షేర్‌హోల్డర్ల నుంచి షేర్ల బదిలీ ద్వారా సువెన్ ఫార్మాకు చెందిన 76.1శాతం షేర్ల సేకరణకు కేబినెట్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. తద్వార సువెన్‌లో విదేశీ పెట్టుబడి 90.1శాతానికి పెరుగుతుందని ఆర్థిక వ్యవహారాల కేంద్ర కమిటీ ప్రకటన తెలిపింది. ఈ ప్రతిపాదనను సెబీ, ఆర్బీఐ, సీసీఐతో పాటు ఇతర సంబంధిత సంస్థలు పరిశీలించిన తర్వాతే ఆమోదించినట్లు వెల్లడించింది. ఐదేళ్లలో (2018-19 నుంచి 2022-23 వరకు) ఫార్మా రంగంలో మొత్తం రూ.43,713కోట్ల ఎఫ్‌డీఐ ఉండగా గత ఆర్థిక సంవత్సరం 58శాతం ఎఫ్‌డీఐతో ఈ రంగం గణనీయమైన వృద్ధిని నమోదు చేసిందని అధికారిక ప్రకటన తెలిపింది.

రేపటి నుంచి 'ఆరోగ్య సురక్ష' సర్వే

- 30న వైద్య శిబిరాలు ప్రారంభం
- ఉచిత వైద్య సేవలే కార్యక్రమం లక్ష్యం
- వైద్య ఆరోగ్య సమీక్షలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి జరుగుతుందని సీఎం చెప్పారు. 15వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, నాలుగు దశల్లో పూర్తవుతుందన్నారు. గతంలో జగనన్న సురక్ష ద్వారా సుమారు 98 లక్షల వివిధ రకాల పత్రాలను ప్రజలకు అందజేశామని, అదే తరహాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సంబంధిత శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్లకు సూచించారు. ఈ నెల 15 నుంచి వలంటీర్లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. కరపత్రాల ద్వారా ఈ కార్యక్రమం గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలన్నారు. ఈ నెల 16 నుంచి ఏఎన్‌యంలు, సీహెచ్‌ఓలు, ఆశావర్కర్లు ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేస్తారని, ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా అందించే వైద్య సేవలను ఎలా పొందాలి, ఏయే ఆసుపత్రులకు వెళ్లాలి, ఎలాంటి జబ్బులకు ఏ ఆసుపత్రిలో చికిత్స చేస్తారన్న విషయాలను ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పిస్తారన్నారు. 30వ తేదీ నుంచి గ్రామ, మండల స్థాయిలో వైద్య శిబిరాల నిర్వహణకు అనువైన పాఠశాలలను గుర్తించాలని, శిబిరాల నిర్వహన బాధ్యతలనూ తహశీల్దార్లు, ఎంపీడీవోలు తీసుకోవాలని సూచించారు. వైద్య శిబిరాలు జరిగే మూడు రోజుల ముందే వలంటీర్లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికి వెళ్లి మెడికల్ క్యాంపులు ఎక్కడ నిర్వహించనున్నారో తెలిపాలన్నారు. వైద్య సేవలు పొందిన వారికి మందులు ఉచితంగా అందజేయాలని సూచించారు. మాకు మందులు ఇవ్వలేదని ఎవరూ చెప్పరాదన్నారు. 45 రోజులు పాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఇందుకు ప్రజలకు మరింత చేరువ కావాలని సీఎం సూచించారు. అనంతరం ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యం పొందడం ఎలా అనే అంశంపై బ్రోచర్‌ను జగన్ విడుదల చేశారు. సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జి.సాయి ప్రసాద్, వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ కృష్ణబాబు, మహిళా శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, కమిషనర్ ఎం.జానకి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్, సీసీఎల్ఎ కార్యదర్శి ఏ ఎండీ ఇంతియాజ్, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ జె నివాస్, ఆరోగ్యశ్రీ సీఈఓ హరీందిర ప్రసాద్, ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్ గుల్జార్, గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ వెంకట మురళీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ పి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రాజకీయ కుట్రతోనే చంద్రబాబు అరెస్ట్: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాజకీయ కుట్రతోనే స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అరెస్టు చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద పశ్చిమ నియోజకవర్గ టీడీపీ నేతలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు జంగాల అజయ్ కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తప్పదనే కారణంతోనే రాజకీయ పగతో చంద్రబాబును అరెస్టు చేయించినట్లు స్పష్టం అవుతుందన్నారు. విభజన అనంతరం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేయడం బాధకారం అన్నారు. కేసులో 37వ ముద్దాయిగా ఉన్న చంద్రబాబును అరెస్ట్ చేయడాన్ని అన్ని రాజకీయ పార్టీలు ఖండిస్తున్నాయని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి టీడీపీ ఆందోళనకు బీజేపీ మద్దతు లేదని చెప్పడం చూస్తుంటే న్యాయపరమైన ఉద్యమానికి మద్దతు తెలపకపోతే అక్రమానికి, అన్యాయానికి మద్దతు ఇస్తున్నారా... అంటూ ధ్వజమెత్తారు. చంద్రబాబు అరెస్ట్‌పై బీజేపీ తన వైఖరి ఏమిటో ఇప్పటివరకు తెలియజేయలేదని, రాష్ట్రంలో అరాచకం జరుగుతుంటే నోరు తెరిచి మాట్లాడలేని దుస్థితిలో బీజేపీ ఉందన్నారు. కేంద్రం సహకారంతోనే చంద్రబాబును జైలుకి పంపించారా... అని దుయ్యబట్టారు. అక్రమ అరెస్టును ఖండిస్తూ రాష్ట్రంలో జరుగుతున్న రాక్షస పాలనకు నిరసనగా ఉద్యమ కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు. కోట మాల్యాద్రి మాట్లాడుతూ చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా టీడీపీ చేసే అన్ని కార్యక్రమాలకు సీపీఐ మద్దతు ఉంటుందని అన్నారు. తొలుత దీక్షలను ప్రారంభించిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ కోవెలమూడి రవీంద్ర (నాని) మాట్లాడుతూ కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలు చంద్రబాబుకు బాసటగా నిలుస్తున్నారని తెలిపారు. 16 నెలల జైలులో ఉండి లక్షల కోట్లు దోచుకున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా అరెస్ట్‌లు చేయిస్తున్నారని మండిపడ్డారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బందెల నాసర్ జీ, నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజి బాబు, చల్లా మరియ దాస్, సమితి సభ్యులు నూతలపాటి చిన్న, యోగయ్య తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మానం పద్మశ్రీ, ఈరెంటి వరప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరావు, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్ (బుజ్జి), పోపూరి నరేంద్ర, సుఖవాసి శ్రీనివాసరావు, ముత్తినేని రాజేష్, నిమ్మల శేషయ్య, లాల్ వజీర్ తదితరులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ' జయప్రదం చేయండి

ఈవి నాయుడు

విశాలాంధ్ర-బెలగాం: అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లాలోని అగ్రిగోల్డ్ బాధితులందరూ ఈ నెల 15వ తేదీన(శుక్రవారం) విజయవాడ నగరంలో జరగబోయే అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావ దీక్షకు హాజరై జయప్రదం చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఈవి నాయుడు, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గెంబలి శ్రీనివాసరావు, సాలాపు అనంతరావు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... అగ్రిగోల్డ్ సంస్థ వేలకోట్ల రూపాయలను డిపాజిట్ల రూపంలో సేకరించి, ఖాతాదారులకు తిరిగి చెల్లింపులు చేయకపోవడంతో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అగ్రిగోల్డ్ సంస్థను సీజ్ చేసి కేసు సీఐడీ కి అప్పగించినా ప్రయోజనం లేదని... 9 ఏళ్ల కాలయాపన జరిగిందే తప్ప డిపాజిట్ దారులకు చెల్లింపులు జరగలేదన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో వున్న ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 'నేను విన్నాను...నేను ఉన్నాను... ఆదుకుంటాను' మన ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల లోపల అగ్రిగోల్డ్ బాధితులందరికీ వారు కట్టిన డబ్బు మొత్తాలను పూర్తి వడ్డీతో సహా చెల్లిస్తామని వాగ్దానం చేసి 4 సంవత్సరాలు దాటినా పూర్తిగా డబ్బులు చెల్లింపులు జరగలేదన్నారు. తొమ్మిది సంవత్సరాల నుండి కొనసాగుతున్న అగ్రిగోల్డ్ బాధితుల డిపాజిట్ సొమ్ములను తిరిగి ఇప్పించడంలో ఈ ప్రభుత్వం కూడా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో బాధితులకి చెప్పిన మాటలు, హామీలను మర్చిపోయి ఏరు దాటిన తరువాత తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వానికి కళ్లు తెరిపించి, మన కష్టాలు, నష్టాలని మరోసారి రోడ్డెక్కి నినదించి వినిపించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. కావున లక్షలాది అగ్రిగోల్డ్ బాధితుల నినాదం వినిపిద్దామని, బాధితుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వదిలిద్దామని, అగ్రిగోల్డ్ బాధితుల చివరి రూపాయి వచ్చే వరకు పోరాడి సాధిద్దామని పిలుపునిచ్చారు.

రేపు అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావ దీక్ష

- జగన్ ఎన్నికల ముందు చేసిన వాగ్దానం తక్షణం అమలు చేయాలి
- ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ: అగ్రిగోల్డ్ కంపెనీ ఎనిమిది రాష్ట్రాల్లో 32 లక్షల మంది నుంచి 6,386 కోట్ల రూపాయల కష్టార్జితాన్ని కొల్లగొట్టిందని... అగ్రిగోల్డ్ కంపెనీ గజ దొంగల్ని శిక్షించాలని, సర్వం కోల్పోయి ఆర్థిక, మానసిక, ఒత్తిడితో రోజూ చచ్చి బతుకుతున్న బాధితుల డిపాజిట్‌లు తక్షణం ఇప్పించమని కోరుతూ ప్రభుత్వానికి తుది విజ్ఞాపన చేస్తూ శుక్రవారం విజయవాడ గాంధీనగర్ ధర్నా చౌక్ వద్ద అగ్రిగోల్డ్ బాధితులు శంఖారావ దీక్ష చేయనున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు విజయవాడ దాసరి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... డిపాజిట్ దారులైన కూలీలు, ఉద్యోగులు, పెన్షనర్లు... డబ్బులు డిపాజిట్ చేసి కంపెనీ బోర్డు తిప్పేసినందున తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. యాజమాన్యం ప్రజల డబ్బులతో కులుకుతోందని ఘాటుగా విమర్శించారు. ఎన్నికల ముందు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన తరువాత అగ్రిగోల్డ్ బాధితులకు ఆరు మాసాల్లో పూర్తి న్యాయం చేస్తానని, వడ్డీ సహా చెల్లిస్తామని హామీ ఇచ్చి నాలుగు సంవత్సరాల మూడు మాసాలు గడిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ చేసిన నిరంతర పోరాటాల కారణంగా 906 కోట్ల రూపాయలు 10.40 లక్షల మందికి రెండు విడతలుగా సాధించుకోగలిగామని చెప్పారు. అగ్రిగోల్డ్ ఏజెంట్లు ఆత్మహత్యలు చేసుకుంటే గత ప్రభుత్వం 142 మందికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చిందన్నారు. సీఎం జగన్ అప్పటి ప్రతిపక్ష నాయుకుడుగా వైసీపీ అధికారంలోకి వస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తానని, పువ్వుల్లో పెట్టి ఇంటికి పంపిస్తానని పేర్కొన్నారని చెప్పారు. కంపెనీ సంగతి నేను చూసుకుంటాను, కోర్టు విషయాలు ప్రభుత్వం చూసుకుంటుందని చెప్పటం జరిగిందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి డిపాజిట్ దారులకు తక్షణం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పేదల సంక్షేమ పథకాల కోసం రెండున్నర లక్షల కోట్లు బటన్ నొక్కి అందించిన సీఎం జగన్... అగ్రిగోల్డ్ బాధితుల కోసం రూ.3,080 కోట్లు అడ్వాన్సుగా తక్షణం ఇచ్చి కంపెనీ ఆస్తుల నుంచి జమ చేసుకోవాలని సూచించారు. కంపెనీ ఛైర్మన్ అవ్వా వెంకట రామారావు 2015 జనవరిలో తమ ఆస్తులు రూ.20 వేల కోట్లు ఉన్నాయని చెప్పటం జరిగిందన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల ఆక్రందనలను మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల ద్వారా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. గత ఎన్నికల్లో అగ్రిగోల్డ్ బాధితుల ఓట్లతో వైసీపీ లబ్ధిపొందిందని పేర్కొంటూ ఇప్పటికీ 40లక్షలకు పైగా ఓట్లను ప్రభావితం చేయగలిగిన స్థితి అగ్రిగోల్డ్ బాధితులకు ఉందన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల గోడు రాజకీయ అంశం కాదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో విజయవాడ గాంధీనగర్ ధర్నా చౌక్‌లో ఒక్క రోజు శంఖారావ దీక్ష చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ తిరుపతిరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పిట్ట ప్రసాద్, షరీఫ్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్, ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అఫ్సర్ పాల్గొన్నారు.

అనుమతి లేదు: డీసీపీ

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు సెప్టెంబరు 15న 'చలో విజయవాడ', జింఖానా గ్రౌండ్‌లో శంఖరావ దీక్ష కార్యక్రమాలకు పిలుపునిచ్చారని... అలాంటి కార్యక్రమాలకు స్థానిక పోలీస్ అధికారులు లేదా ప్రభుత్వం నుంచి ఏ విధమైన అనుమతులు లేవని ఎన్టీఆర్ జిల్లా డీసీపీ విశాల్ గున్ని తెలిపారు. విజయవాడలోని పోలీస్‌కమిషనర్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరంలో సెక్షన్ 144 సీఆర్‌పీసీ, పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 ప్రకారం నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయని చెప్పారు. ఎవరైతే నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తారో వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. తమకు అందిన సమాచారం ప్రకారం కొంతమంది బయటి వ్యక్తులు ఈ ధర్నా కార్యక్రమంలో చేరి హింసకు పాల్పడే అవకాశం ఉందన్నారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు చాలా జరిగాయని ప్రస్తుతమున్న శాంతి భద్రతల పరిస్థితుల దృష్ట్యా ఏ విధమైన అనుమతులు లేవని చెప్పారు. నగరంలో 2వేల మంది పోలీస్ సిబ్బంది, సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, వీడియోగ్రఫీ ద్వారా నిఘా పెట్టి, పటిష్ట పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. బుధవారం నుంచి విజయవాడ వైపు వచ్చే వాహనాలన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని తెలిపారు.

జగన్‌వి నీచ రాజకీయాలు: జగదీశ్

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: రాష్ట్రంలో ప్రతిపక్ష నేతల గొంతు నొక్కేందుకు సీఎం జగన్ మోహన్ రెడ్డి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ పేర్కొన్నారు. తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి పరిటాల సునీత తోపాటు ఆపార్టీ నాయకులు బుధవారం నిరాహారదీక్షలు చేపట్టారు. అనంతపురం రూరల్ పరిధిలో టీడీపీ శ్రేణులు చేపట్టిన రిలే నిరాహారదీక్షా శిబిరానికి సీపీఐ, జనసేన పార్టీ నాయకులు చేరుకొని తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై వైసీపీ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న ప్రతిపక్ష పార్టీల ఉనికి లేకుండా చేసేందుకు సీఎం జగన్ నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం ఆ వ్యక్తం చేశారు. ఆ క్రమంలోనే ప్రతిపక్ష పార్టీలు ఎలాంటి నిరసన కార్యక్రమాలు చేపట్టకుండా జీఓ నం.1 తీసుకువచ్చి అరెస్టులు, గృహనిర్బంధాలు చేశారని గుర్తు చేశారు. అయితే సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి జీవో నం.1ను రద్దు చేయించారన్నారు. హైకోర్టు సైతం సీఎం జగన్ తీరును తప్పు బట్టినా మరోసారి ప్రతిపక్ష నేతలను అరెస్టులు చేయించి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును మానసికంగా, భౌతికంగా ఇబ్బందులకు గురి చేయాలనే ఎత్తుగడతోనే నాలుగేళ్ల అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ కేసును తెర మీదకు తెచ్చారని సీఎం జగన్ పై విరుచుకు పడ్డారు. రాష్ట్ర సీఐడీ పోలీసులు సీఎం జగన్ కు సొంత సైన్యంలా పనిచేస్తున్నారని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. చంద్ర బాబు అరెస్టును జాతీయ రాజకీయ పార్టీల నేతలు సైతం వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. సీఎం జగన్ మోహన్ రెడ్డికి గుణపాఠం నేర్పేందుకు అన్ని రాజకీయ పార్టీలను ఏకమై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టు అప్రజాస్వామికమని సీపీఐ, సీపీఎం, జనసేన, కాంగ్రెస్ పార్టీ, ఎమ్మార్పీఎస్, ఇతర ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. ఇప్పటికే చంద్రబాబు అరెస్టు అక్రమమని విజయవాడలో సీపీఐ అధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి సీఎం జగన్ వికృత చర్యలను ఖండించాయన్నారు. నిజాయితీగల నాయకుడు చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ టీడీపీ చేసే పోరాటాలకు సీపీఐ బాసటగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి మల్లికార్జున, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, శ్రీరాములు, రమణ, నాగరాజు,నాయకులు రమేష్, నరేష్, నీళ్లపాల రామకృష్ణ, ధనుంజయ, రాజు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మరింత కృషి

ఆర్టీసీ(పీటీడీ) రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ)కు ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపుతో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మరింతగా కృషి చేస్తామని యూనియన్ అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు చెప్పారు. వివిధ దశల్లో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన విజ్ఞప్తుల మేరకు యూనియన్‌కు గుర్తింపునిస్తూ ఉత్తర్వుల్ని జారీజేసిందన్నారు. ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్‌కు జీవో నంబరు-97 ద్వారా గుర్తింపునివ్వడాన్ని హర్షిస్తూ, బుధవారం రాష్ట్రంలోని 129 డిపోలు, నాలుగు జోన్ల వర్క్‌షాప్ యూనిట్ల వద్ద ఉద్యోగులు స్వీట్లు పంపిణీ చేసి, కేక్‌లు కట్ చేసి సంబరాలు నిర్వహించారు. విజయవాడ ఆర్టీసీ హౌస్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కేఎస్ బ్రహ్మానందరెడ్డి, ఎ.కోటేశ్వరరావు, రాఘవరెడ్డి, స్వరూపానందరెడ్డి, ఆర్టీసీ ఎండీ ఓఎస్‌డీ బాలస్వామిని ఈయూ రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో సత్కరించారు. అనంతరం ఆర్టీసీ హౌస్‌లో అన్ని విభాగాలలో ఉన్న అధికారులను, సిబ్బందిని కలసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ తరపున సీఎం వైఎస్ జగన్‌కు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమరాల రావుకు, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుకు యూనియన్ నేతలు ధన్యవాదాలు తెలిపారు. దామోదరరావు మాట్లాడుతూ... 72 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో విజయాల్ని ఉద్యోగులకు సాధించామని, ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు ఆధారంగా ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ యూనియన్‌తోపాటు ఏపీజేసీ అమరావతితో కలిసి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రాష్ట్ర నాయకులు ఎండీ ప్రసాద్, ఎ.రామచంద్రరావు, మందపాటి శంకరరావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి షాక్

మళ్లీ వైసీపీ గూటికి నెల్లూరు మేయర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి షాక్ తగిలింది. ఆయన ప్రధాన అనుచరులుగా ఉన్న నెల్లూరు మేయర్ స్రవంతి తిరిగి వైసీపీలోకి వచ్చేందుకు సిద్ధమయ్యారు. వైసీపీ నుంచి సస్పెన్షన్‌కు గురైన శ్రీధర్‌రెడ్డి అనంతరం టీడీపీలో చేరారు. ఆ సమయంలో ఆయనతో ఉన్న చాలా మంది కార్పొరేటర్లు వైసీపీలోనే ఉండగా... మేయర్ స్రవంతి మాత్రం శ్రీధర్‌రెడ్డికి మద్దతు పలికారు. దీంతో నెల్లూరు కార్పొరేషన్ సమావేశాల సమయంలో ఆమెకు అడుగడుగునా వైసీపీ కార్పొరేటర్ల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీకి శ్రీధర్‌రెడ్డి దూరమయ్యాక, ఆమె కూడా వైసీపీకి రాజీనామా చేశారు. ఇటీవల కాలంలో శ్రీధర్‌రెడ్డి సోదరుడు గిరిధర్‌రెడ్డితో ఆమెకు మధ్య విభేదాలు పొడచూపాయి. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఎంత సర్దిచెప్పినా పరిష్కారమవ్వలేదు. తాజాగా స్రవంతి దంపతులు తాడేపల్లిలోని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో భేటీ అవ్వడం చర్చనీయాంశమైంది. మేయర్ దంపతులు త్వరలో సీఎం జగన్‌తో సమావేశం కానున్నారు.

సరుకు రవాణాలో విశాఖ పోర్ట్ రికార్డ్

విశాలాంధ్రబ్యూరో-విశాఖపట్నం: సరుకు రవాణాలో విశాఖపట్నం పోర్టు... దేశంలోని అన్ని మేజర్ పోర్టులతో పోటీ పడి మూడో స్థానంలో నిలిచింది. 2023 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జులై వరకూ పోర్టుల పనితీరుపై కేంద్ర పోర్టులు, నౌకాయాన జలరవాణా శాఖ కార్యదర్శి సమీక్ష నిర్వహించారు. మేజర్ పోర్టుల పనితీరుపై కొన్ని కీలక అంశాలను మంత్రిత్వశాఖ పరిశీలిస్తోంది. ఇందులో సరుకు పరిమాణం (కార్గో వాల్యూమ్), ప్రి బెర్తింగ్ డిటెన్షన్ సమయం, టర్న్‌ఎరౌండ్ సమయం వంటి అంశాలున్నాయి. ఈ సూచీలన్నిటిలోనూ విశాఖపట్నం పోర్టు అథారిటీ ప్రగతిని కనబరిచింది. గత ఏడాదితో పోల్చుకుంటే నిర్దిష్ట సమయంలో పోర్టు 33.14 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేసి సరుకు పరిమాణంలో 3 శాతం వృద్ధిని నమోదు చేసింది. పోర్టు సాధించిన ప్రగతిపై పోర్టు డిప్యూటీ చైర్ పర్సన్, విభాగాధిపతులు, సీనియర్ అధికారులు, ఉద్యోగులను పోర్టు చైర్ పర్సన్ డా.అంగముత్తు ప్రసంసించారు. పోర్టు ఈ ఘనతను సాధించడంలో మద్దతుగా నిలిచిన పోర్టు భాగస్వాములను (స్టివెడోర్స్) చైర్ పర్సన్ అభినందించారు. ఈ ప్రగతిని కొనసాగించాల్సిందిగా ఆయన సూచించారు. పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ ఈ వివరాలను తెలియజేశారు.

జగన్ పాలనకు అంతిమ ఘడియలు

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: జగన్ పాలనకు అంతిమ ఘడియలు దగ్గరపడ్డాయని మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ఉన్న జైలులో కరుడుకట్టిన నేరస్తులు ఉన్నారని, అక్కడ బాబుకి సురక్షితం కాదని, ఆయనకు ఏదైనా జరిగితే ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోవల్సి వస్తుందని హెచ్చరించారు. మొద్దు శ్రీనును జైలులోనే చంపేశారన్నారు. జగన్ 16 నెలలు జైలులో ఉన్నాడని, చంద్ర బాబును ఒక్క రోజు అయినా జైలులో పెట్టాలన్న దుర్బుద్ధి జగన్‌కు ఉందని ఆరోపించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును బీజేపీ, 'ఇండియా' కూటమి, జాతీయ నేతలు ఖండిస్తున్నారన్నారు. అలాగే సినిమా రంగానికి చెందిన వారు కూడా చాలా మంది ఖండిస్తున్నారని తెలిపారు. అయితే కొంతమంది బాబు అరెస్టును ఖండించడానికి భయపడుతున్నారని, తమపై కూడా కేసులు పెట్టి వేధిస్తారేమోనని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టు చేసినప్పటి నుంచి టీడీపీ నేతలను వేధిస్తున్నారన్నారు. సీఎం హోదాలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించిన చంద్రబాబుపై తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేయడం జగన్‌మోహన్ రెడ్డి అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిని గద్దె దించి గుణపాఠం చెప్పడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారని, 2024లో సైకిల్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. అంతకుముందు, విశాఖలో గాంధీ విగ్రహం వద్ద నేతల నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎంవీపీ కాలనీలోని ఆయన నివాసం వద్ద బుధవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ, జనసేన నాయకురాలు శివలక్ష్మి, విశాఖ ఉత్తర నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

ఆర్.ఓ.సి.నెం.1671/2023/ఇ1 తేది: 13-09-2023

నిట్ నెం.36/ఇ.టి.ఓ/2023-24

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ - సాధారణ నిధులు క్రింద మొత్తము 10 పనులకు ఈ దిగువ ఉదహరించిన తేదీల యందు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.

మొత్తము పనులు - 10 నెం.లు పని నెం. 01 నుండి 10 లకు :	అంచనా వ్యయము రూ.186.61 లక్షలు
1. టెండరు షెడ్యూల్స్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేది	: ది.14-09-2023ఉదయం గం.11.00ని లనుండి
2. టెండర్ల షెడ్యూల్స్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది	: ది.19-09-2023 ఉదయము గం. 11.00 ని.ల వరకు
3. ప్రైస్ బిడ్ తెరుచు తేది	: ది.19-09-2023 మధ్యాహ్నము గం.2.00 ని.లకు

మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ http://www.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు. మొబైల్ నెం.9849907303

యు. శారదా దేవి
కమిషనరు,
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

సంపాదకీయం

చిట్ట చివరికి ఎజెండా

వచ్చే సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో చర్చించాల్సిన ఎజెండాను ఎట్టకేలకు మోదీ ప్రభుత్వం బుధవారం పొద్దుపోయాక సూచాయగా ప్రకటించింది. ఓ రకంగా ప్రతిపక్షాల ఒత్తిడి కారణంగానే ఎజెండాను వెల్లడించినట్లు భావించవచ్చు. ఈ సమావేశం జరగడానికి ఒక్క రోజు ముందు ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం జరుగుతుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ దయతలిచి తెలియజేశారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఈ నెల 18 నుంచి 22 దాకా అయిదు రోజులపాటు జరుగుతాయని ఆయన ఆగస్టు 31న ప్రకటించారు. ఆ తరవాత ప్రభుత్వం వైపు నుంచి ఏ సమాచారమూ లేదు. ఇప్పటివరకు తెలిసింది ఏమిటంటే మొదటి రోజు సమావేశాలు పాత పార్లమెంటు భవనంలో జరుగుతాయని, మిగతా నాలుగు రోజులు కొత్త పార్లమెంటు భవనంలో జరుగుతాయని మాత్రమే. ఈ ప్రత్యేక సమావేశాల్లో చర్చనీయాంశాలు ఏమిటి అని ప్రశ్నిస్తూ కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ ఇంతకుముందు ప్రధానమంత్రికి ఒక లేఖ రాశారు. ఈ ప్రత్యేక సమావేశాలలో చర్చించవలసిన అంశాలేమిటో చెప్పాలని కోరారు. తమ దృష్టిలో చర్చించవలసిన తొమ్మిది అంశాలను ఆమె తెలియజేశారు. దానికి ఇప్పటిదాకా సమాధానం లేదు. పార్లమెంటు కేవలం ప్రభుత్వ పక్షానిదే కాదు. ప్రతిపక్షాలకు కూడా అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకునే హక్కు ఉంది. పార్లమెంటు ప్రజలు చెల్లించే పన్నుల ద్వారా సమకూరే డబ్బుతో నడుస్తుంది కనక ప్రభుత్వం ప్రజలకూ జవాబుదారుగా ఉండాలి. ప్రతిపక్షాలతో మాట మాత్రంగానైనా చెప్పకుండా మోదీ సర్కారు ఈ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. 17వ తేదీన జరిగే అఖిలపక్ష సమావేశంలో వివరాలు చెప్పొచ్చులే అన్నది ప్రభుత్వ ఆలోచన కావచ్చు. కానీ మోదీ హయాంలో అన్నీ ఏకపక్ష నిర్ణయాలే ఉంటాయి. ప్రతిపక్షాలు ఎంత అరిచి గీపెట్టినా ప్రభుత్వం నుంచి స్పందన కనిపించదు. పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవాన్ని ప్రతిపక్షాలు బహిష్కరించినా మోదీ పట్టించుకోలేదు. హాజరైతే కావచ్చు లేదా మిన్నకుండండి అన్న ధోరణిలోనే వ్యవహారాలు సాగుతున్నాయి. ఇంతకన్నా అప్రజాస్వామిక వ్యవహారం ఏమీ ఉండదు. విదేశాలకు వెళ్లినప్పుడు ప్రధానమంత్రి మోదీ ప్రజాస్వామ్యం గురించి, భావ ప్రకటనా స్వేచ్ఛ గురించి బాకా ఊదుతుంటారు. కానీ స్వదేశంలో మాత్రం, చివరకు పార్లమెంటు నిర్వహణలోనూ ప్రజాస్వామ్యానికి విరుద్ధంగానే ప్రవర్తిస్తారు. ప్రతిపక్షాల మాటను ఆయన ఏ మాత్రం పట్టించుకోరు. భావప్రకటనా స్వేచ్ఛ ఊసే రానివ్వరు. సర్వాధికారాలతో పాటు భావప్రకటనా స్వేచ్ఛ తనకొక్కడికే ఉందనుకుంటారు. ఇటీవల జి20 శిఖరాగ్ర సభకు అమెరికా అధ్యక్షుడు హాజరైనప్పుడూ సంప్రదాయికంగా వస్తున్న విలేకరుల సమావేశం నిర్వహించడానికి మోదీ అంగీకరించలేదు. బైడెన్‌తో పాటు వచ్చిన అమెరికా పత్రికా రచయితలతో తాను ముచ్చటించలేదు, బైడెన్‌ను మాట్లాడనివ్వలేదు. ఉమ్మడిగా విలేకరుల సమావేశం నిర్వహిస్తే విదేశీ పత్రికా రచయితలతో పాటు భారత పత్రికా విలేకరులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పవలసి వస్తుందన్న భయం మోదీని నిరంతరం పీడిస్తూ ఉంటుంది. ఇక్కడ విలేకరులతో మాట్లాడడానికి అవకాశం రానందువల్ల బైడెన్ వియత్నాంలో భారత్ గురించి, మానవ హక్కులు, భావ ప్రకటనా స్వేచ్ఛ మొదలైన అంశాలను లేవనెత్తవలసి వచ్చింది. బైడెన్ విలేకరులతో మాట్లాడేట్టు చేయడానికి అమెరికా కనీసం ఆరుసార్లు ప్రయత్నించి విఫలమైంది. అయినా మోదీ మంకుతనమే గెలిచింది. ప్రతిపక్షాలంటే ఆయనకు తెలిసిందల్లా అవి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఆ నేతలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్, సీబీఐ లాంటి వ్యవస్థల చేత దాడులు చేయించడమే. ఆయన లక్ష్యం కేవలం కాంగ్రెస్ ముక్త్ భారత్ మాత్రమే కాదు. ఆయనకు కావలసింది ప్రతిపక్షమే లేని పార్లమెంటు. పార్లమెంటు అంటే నాలుగు గోడలు, పైన ఓ కప్పు కాదు. వెయ్యి కోట్లు ఖర్చు పెట్టి కట్టిన మహత్తర భవనం కాదు. 2014లో మొదటిసారి పార్లమెంటు భవనంలో ప్రవేశించేటప్పుడు ఆ భవనం మెట్ల దగ్గర సాష్టాంగపడడమే ప్రజాస్వామ్యం కాదు. ఇటీవల ముగిసిన పార్లమెంటు వర్షాకాల సమావేశంలో ప్రశ్నించిన ప్రతిపక్ష సభ్యులను సభనుంచి సస్పెండ్ చేసి తమకు కావలసిన బిల్లులను ఏకపక్షంగా ఆమోదింప చేసుకున్నారు. ప్రతిపక్షానికి ఎజెండా ఏమిటో తెలియజేస్తే ప్రపంచం తలకిందులైపోతుందన్న భయం మోదీని పీడిస్తున్నట్టు ఉంది. ప్రతిపక్షం పార్లమెంటు సమావేశాల కోసం సిద్ధం అయ్యే అవకాశం ఆయన ఇవ్వరు. ప్రతిపక్షాలు ఈ సమావేశాలలో ఉమ్మడి వ్యూహాన్ని ఎక్కడ ఖరారు చేస్తాయోనన్న భయం మోదీకి ఉండొచ్చు.

18వ తేదీన జరిగే సమావేశాలలో పాత పార్లమెంటు భవనానికి వీడ్కోలు చెప్తారన్న వార్త వచ్చింది. కేవలం దానికోసమే అయితే అయిదు రోజులు ఎందుకో? అంటే అధికార పక్షానికి కొన్ని బిల్లులు ఆమోదింప చేయడంలాంటి ఎజెండా ఉంది. ఆ ఎజెండా ప్రతిపక్షాలకు చెప్పకపోవడం, తమకు లోకసభలో సంపూర్ణమైన మెజారిటీ ఉంది కనక చెప్పనవసరం లేదన్న అభిప్రాయం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేయడమే. అందుకే ప్రత్యేక సమావేశాలలో ఏం చర్చిస్తారు అన్న విషయంలో అనేక ఊహాగానాలు కొనసాగాయి. వర్షాకాల సమావేశాలు ఆగస్టు 11న ముగిశాయి. నవంబర్‌లో శీతాకాల సమావేశాలు జరగవలసి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం హయాంలోనే అవి జరుగుతాయి. అలాంటప్పుడు ఎజెండా రహస్యంగా ఉంచడం హాస్యాస్పదమే కాదు ప్రజాస్వామ్యం అంటే లెక్కచేయని తత్వానికే నిదర్శనం. ఇండియా కాదు భారత్ అన్న ప్రతిపాదనను పార్లమెంటులో ఆమోదింప చేసుకోవడం, మహిళా రిజర్వేషన్ల బిల్లు బూజు దులిపి గట్టెక్కించడం లాంటివి జరగొచ్చు నన్నవి కూడా ఊహాగానాల్లో భాగమే. దీన్ని రహస్యంగా ఉంచవలసిన అవసరమేముంది కనక! పార్లమెంటరీ సమావేశంలో ఉమ్మడి బాధ్యత ఉంటుంది. ఏకపక్ష నిర్ణయాలకు చోటు ఉండకూడదు. కానీ ఈ ప్రత్యేక సమావేశాలలో ఏం జరుగుతుందో కనీసం మంత్రివర్గానికైనా తెలుసునా అన్న అనుమానం కలగక మానదు. పెద్దనోట్ల రద్దు అంశం మోదీ కనీసం అప్పటి ఆర్థిక మంత్రికైనా తెలియకుండా ప్రకటించేశారు కనక మోదీ నడవడిక ఎంత మాత్రం ఆశ్చర్యం కలిగించదు. ఇలాంటి స్థితిలో ప్రతిపక్షాలకు ఎజెండా తెలియజేయాలనుకోవడం కూడా అత్యాశే కావొచ్చు. ఈ సమావేశంలో ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ ఉండదని మాత్రం పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి ప్రహ్లాద్ జోషి తెలియజేశారు. అడిగిన ప్రశ్నలకే జవాబివ్వని ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రశ్నోత్తరాల సమయం లేకపోతే ఏం మునిగిపోతుంది? మెజారిటీ ఎటువైపుఉన్నా తీసుకున్న నిర్ణయాలకు ప్రతిపక్షం కూడా కట్టుబడి ఉండాలికదా! మోదీ మనసులో ఏముందో మహా అయితే కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు తెలిసే అవకాశం ఉండవచ్చు. ఎందుకంటే ఇష్టానుసారం సకల వ్యవహారాలను నడుపుతున్నది మోదీ, అమిత్ షానే! ఇదంతా ప్రశ్నలకు జవాబు చెప్పకుండా నిరంకుశంగా పరిపాలించడానికే.

ఈ-వ్యర్థాలు మహా ప్రమాదం

నాటి పాతరాతి యుగం నుంచి నేటి డిజిటల్ ఏఐ యుగం వరకు మానవాళి జీవితంలో ఎన్నో మార్పులు, ఎంతో విప్లవాత్మక పరిణామక్రమం సజీవ చరిత్రగా నిక్షిప్తమైంది. కుటుంబానికి రేడియో విలాసవంతమైన ఉపకరణమైన గతం నుంచి నేడు ప్రతి ఇంట్లో స్మార్ట్ టీవీ మోగుతోంది. ట్రంక్‌కాల్ వసతి నుంచి ప్రతి చిట్టి పొట్టి చేతిల్లో కూడా స్మార్ట్ ఫోన్ కూర్చొంది. మానవరహిత ఆఫీసు నడిపించే మరమనిషి రోబో రూపంలో నిలబడ్డాడు. క్షణాల్లో సమాచార వితరణకు సామాజిక మాధ్యమ వేదికలు అందుబాటులోకి వచ్చాయి. దూరాలు చెరిపేస్తున్న వీడియో కాల్ వసతి మన సొంతమైంది. గాల్లో ఎగిరే విమానాన్ని చూసి కేరింతలు కొడుతూ అపూర్వ అనుభవంగా మనసుల్లో దాచుకున్న రోజుల నుంచి సామాన్యుడు విమానయానంచేసే స్థాయి ఏర్పడింది. అరచేతిలో స్మార్ట్‌ఫోన్ రూపంలో వైకుంఠం వెలసింది. శాస్త్ర, సాంకేతిక విప్లవంతో ప్రపంచమే కుగ్రామం అయ్యింది. అంతరిక్షయానం ఆటగా మారింది. గ్రహాలకు యాత్రలు, ఉపగ్రహాలపై మానవ నివాసాలు సుసాధ్యమయ్యే రోజులు చూస్తున్నాం. ఉత్తరాలు రాయడం మానేసి, ఈ-మెయిల్స్ పంపిస్తున్నాం. మానవాళి జీవనశైలిని సమూలంగా మార్చివేసిన నవ్య ఉపకరణాల్లో స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ టీవీలు, ల్యాబ్ ట్యాబ్స్, పిసీలు, కంప్యూటర్స్, సామాజిక మాధ్యమాలు, రోబోటిక్స్, క్లౌడ్-ఆధారిత వ్యవస్థలు, కృత్రిమమేధ, ఐటీ లాంటి నవ్య సాంకేతిక ఫలాలు మార్కెట్‌ను ముంచేస్తున్నాయి. సామాజిక ఆర్థిక ప్రగతి, ఉత్పత్తుల పెరుగుదల, కనెక్టివిటీ ఊహకందనంత పెరిగిపోయింది. నేటి డిజిటల్ విప్లవం అత్యంత వేగంగా, తీవ్రంగా విస్తరిస్తోంది. గత కొన్ని దశాబ్దాల్లో పిసీల స్టోరేజ్ కెపాసిటీ, ఉపకరణ సైజ్‌ల్లో అనేక రెట్లు మార్పులు చూస్తున్నాం. మూడు దశాబ్దాల క్రితం గ్లోబల్ ఐపి ట్రాఫిక్ రోజుకు 100 జీబీ ఉండగా, నేడు సెకనుకు 1.5 లక్షల జీబీలకు చేరడం జరిగింది. కోవిడ్-19 సంక్షోభం అనంతరం డిజిటలైజేషన్ వేదికగా పరిశ్రమలు, వ్యక్తులు, విద్యార్థులు, ఉద్యోగస్థులు, వాణిజ్యాల ప్రాధాన్యతలు మనం అనుభవిస్తున్నాం. డిజిటల్ ఉపకరణాల ఉత్పత్తికి సంబంధించిన కాలుష్యాన్ని డిజిటల్ పొల్యూషన్‌గా పిలుస్తారు. డిజిటల్ విప్లవం వేదికపైన కనిపిస్తున్న వెలుగులను చూస్తున్న మానవాళి తెర వెనుక దాగి ఉన్న దుష్ప్రభావాలు రాబోయే తరాలకు శాపాలుగా మారనున్నాయని మరిచి పోతున్నాం. వ్యక్తులు, సంస్థలు, సామాజిక వ్యవస్థలు అనేక వికృత రూపాలను చూడనున్నాయి. డిజిటల్ పరిశ్రమతో అస్థిరాభివృద్ధి, పర్యావరణ విచ్ఛిన్నత పెనవేసుకున్నాయి. డిజిటల్ టెక్నాలజీ ఉపకరణాల తయారీలో అరుదైన ఖనిజలోహాలు, ఖరీదైన కోబాల్ట్ లాంటి లోహాలు విచ్చలవిడిగా వాడుతున్నాం. ఈ క్రమంలో పర్యావరణానికి హానిచేయగల హెవీ మెటల్స్, రేడియోధార్మిక పదార్థాలను విసర్జించడంతో భవిష్యత్తు ఎంతో ప్రమాదకర అనుభవాలను రుచి చూడనున్నాం. డిజిటన్ మౌలిక సదుపాయాల కల్పనకు అపారశక్తి వినియోగం, కర్బన ఉద్గారాలు పెరగడం, భూతాపం లాంటి ప్రతికూలతలు దాగి ఉన్నాయి. ప్రపంచంలోని 3శాతం విద్యుత్తును వినియోగిస్తూనే, 2 శాతం గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారాలను చేస్తున్నాం. కృత్రిమమేధ సృష్టి వెనుక దాదాపు 300 టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ విడుదలవుతోంది. బిట్‌కాయిన్, క్రిప్టోకరెన్సీ టెక్నాలజీ ఎంతో విద్యుత్తును వినియోగిస్తున్నాయి. పారిశ్రామిక వ్యర్థాల దుష్ప్రభావాల కన్నా ఎలక్ట్రానిక్ వ్యర్థాల కాలుష్యం దీర్ఘకాలికంగా ప్రమాదకర మవుతున్నది. ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి 300 మిలియన్ల డిజిటల్ ఉపకరణాలు, 1 బిలియన్ మొబైల్‌ఫోన్లు తయారు అవుతున్నాయని అంచనా. ఇంటర్నెట్ విస్తార వినియోగంతో నేడు 4శాతం ఉన్న గ్లోబల్ ఎమిషన్స్ 2040 నాటికి 14 శాతం వరకు చేరవచ్చు. డిజిటలైజేషన్ పుణ్యాన ప్రమాదకరమైన ఈ-వ్యర్థాలు (ఎలక్ట్రానిక్ వేస్ట్) పర్యావరణంలోకి చేరి ప్రమాదకర కాలుష్యాలుగా నిలుస్తున్నాయి. టీవీలు, స్మార్ట్ ఫోన్‌లు, కంప్యూటర్ ఉపకరణాలు, స్మార్ట్ వాచ్‌లు లాంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాల ఉత్పత్తుల్లో ముఖ్యమైన లోహాలు, విద్యుత్తు వినియోగం ఇమిడి ఉంటాయి. వీటిలో 80 శాతం ఈ-వ్యర్థాలు, 20 శాతం విద్యుత్ వినియోగ కాలుష్యం జనిస్తాయి. కంప్యూటరైజేషన్ పరిశ్రమ దుష్ప్రభావాలుగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణ విచ్ఛిన్నాలుగా మారుతున్నాయి. ప్రపంచ ఘనవ్యర్థాల్లో 2 శాతం ఈ-వ్యర్థాలను, 70శాతం విష వ్యర్థాలను విడుదల చేస్తున్నాయి. ఐరాస అంచనా ప్రకారం సాలీనా 50 మిలియన్ టన్నుల ఈ-వ్యర్థాలు విడుదల అవుతున్నాయని తెలుస్తున్నది. వీటిలో గరిష్టంగా 20శాతం మాత్రమే రీసైక్లింగ్ అవుతున్నది. డిజిటల్ విప్లవంతో పరోక్షంగా నియోగ దారులకు కలుగుతున్న అనారోగ్యాలు వెలకట్టలేనివి. నిరంతరం నీలి తెరలను అతుక్కొని ఉంటున్న యువత కంటి జబ్బులు, మానసిక ఒత్తిడి, వ్యసనం, ఒంటరితనం, ఉద్రేకం లాంటి లక్షణాలను ప్రదర్శిస్తున్నారు. నవ్యత వైపుకు డిజిటల్ అడుగులు పడుతున్న వేళ సుస్థిరాభివృద్ధి దిశగా, గ్రీన్ వ్యవస్థల స్థాపనలు, కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి ప్రపంచ దేశాలు ప్రయాసపడని యెడల డిజిటల్ విప్లవం కాలుష్య విస్తరణ కేంద్రంగా మారుతుందని గమనిస్తూ, సుస్థిరాభివృద్ధి వైపుకు పటిష్ట అడుగులు వేద్దాం. స్మార్ట్ డిజిటల్ ఆలోచనలతో స్వచ్ఛతకు పట్టం కడదాం.

ప్రజాస్వామ్యానికి మోదీ ఎసరు

చలసాని వెంకటరామారావు

ప్రజాస్వామ్యం అనే భావన పురాతన గ్రీస్‌లో ఏథెన్స్ నగరరాజ్యంలో ఉద్భవించింది. "క్లీస్టెనెస్" ఎథీనియన్ ప్రజాస్వామ్య పితామహుడిగా పరిగణించారు. క్లీస్టెనెస్ 'ఐసోనోమియా' అనే కొత్త రాజకీయ వ్యవస్థను అంటే రాజకీయ సమానత్వం అనే దానిని ప్రవేశపెట్టాడు. ఇది ప్రత్యక్ష ప్రజాస్వామ్యం! దీనిలో ప్రజలందరికీ ఓటు ద్వారా తన నాయకుని ఎన్నుకునే స్వేచ్ఛ గలిగిన శాసనవ్యవస్థ ఉంటుంది. చాలాకాలం తరువాత రోమన్ రిపబ్లిక్ ప్రభావంతో నేటి ఆధునిక ప్రజాస్వామ్య ప్రాతినిధ్య విధానం ఆచరణకు వచ్చింది. ప్రపంచంలో ఆధునిక ప్రజాస్వామ్యం మొదట బ్రిటన్‌లో ప్రారంభమైంది. 1948లో బ్రిటన్‌లో సార్వత్రిక ఓటుహక్కు కల్పించారు. 1929కి ముందు బ్రిటన్‌లో మహిళలకు ఓటుహక్కు లేదు. 1789 విప్లవం నుండి ఫ్రాన్స్‌లో 'ఫ్రెంచ్ డిక్లరేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ మ్యాన్' ద్వారా ప్రజాస్వామ్యం ప్రారంభమైంది. 1848 విప్లవం తరువాత ఫ్రాన్స్‌లో సార్వత్రిక పురుష ఓటింగ్ హక్కు, 1946లో స్త్రీలకు ఓటుహక్కు ఇచ్చారు. 1776 స్వాతంత్ర్య ప్రకటన తరువాత అమెరికాలో ప్రజాస్వామ్యం అమలు చేయడమైంది. 19వ శతాబ్దంలో అనేక యూరోపియన్ దేశాలు ప్రజాస్వామ్యం బాటపడ్డాయి. మొదటిది ప్రపంచయుద్ధం తరువాత ఐరోపా దేశాలు, స్కాండినేవియా దేశాలు, రెండవప్రపంచ యుద్ధం తరువాత జర్మనీ, ఇటలీ దేశాలు, తూర్పుయూరప్, అమెరికా దేశాలలో ప్రజాస్వామ్యం నెలకొల్పడమైంది. 1947లో భారతదేశం స్వాతంత్ర్యం పొందటంతో భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులు ఏర్పడ్డాయి. అబ్రహం లింకన్ చెప్పినట్లు "ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే ఎన్నుకునే" ప్రభుత్వ విధానం ప్రాతిపదికగా 1950లో మన రాజ్యాంగాన్ని పార్లమెంటు ఆమోదించింది.. 'లౌకిక, సర్వసత్తాక, సామ్యవాద, ప్రజాస్వామిక' దేశంగా ఎన్నో విజయాలను సాధించింది. చట్టం దృష్టిలో ప్రతి ఒక్కరికి సమానత్వం, స్వేచ్ఛ, ఇతర ప్రాథమిక హక్కులు ఉంటాయి. మనం స్వాతంత్ర్యం పొందే నాటికి నిరక్షరాస్యత, పేదరికం ఉన్నాయి. బ్రిటిష్ వలసపాలన, దేశవిభజన వల్ల స్థానభ్రంశం చెందిన స్థిరమైన నివాసంలేని స్థితిలో సైతం ప్రథమ స్వాతంత్ర్య ఎన్నికలు 1951-52 ప్రాంతంలో జయప్రదంగా జరిగాయి. సార్వత్రిక ఓటింగ్‌హక్కు ప్రాతిపదికగా జాతి, కులం,మతం, భాష సంస్కృతులతో సంబంధం లేకుండా భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించి ప్రపంచంలో భారత ప్రజాస్వామిక వ్యవస్థ ఒక విశిష్టతతో విజయం సాధించింది.

1975లో నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ దేశంలో అత్యవసర పరిస్థితి విధించి దేశ ప్రజాస్వామిక వ్యవస్థకు ఒక మాయనిమచ్చను తెచ్చారు. 2014 నుండి దేశాన్ని పాలిస్తున్న నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా దేశప్రజాస్వామిక సౌధం పునాదులను ధ్వంసంచేసే చర్యలకు పూనుకున్నది. గత 9 ఏళ్ల మోదీ పాలనలో దేశ ప్రజాస్వామిక వ్యవస్థ తీవ్రమైన కుదుపులకు గురైంది. కుట్రపూరితంగా దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో మూల స్తంభాలైన శాసన వ్యవస్థను, కార్యనిర్వాహక వ్యవస్థను, న్యాయవ్యవస్థను నియంత్రిస్తోంది. సమాచార వ్యవస్థను కూడా తమ చేతులలోకి తీసుకుని గోబెల్స్ తరహా ప్రచారానికి పాల్పడుతున్నది. బీజేపీ పాలనలో దేశంలో మత విద్వేషాలను తరచు రెచ్చగొడుతున్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం నెలకొల్పటంలో పాలకులు విఫలం చెందారు. తరచుగా మతం పేరుతో మూకహత్యలు, సామూహిక అత్యాచారాలు జరుగుతున్నాయి. దేశంలో పరిస్థితులు వివరిస్తూ రాష్ట్రపతికి 69మంది మేధావులు లేఖరాస్తే వారిని

దేశద్రోహులుగా చిత్రించారు. బీజేపీకి చెందినవారు హత్యలుచేసి మేమే హత్యచేశాం అని ప్రకటించినా ఎటువంటి చర్యలు లేవు. కోర్టులో శిక్షలు అనుభవిస్తున్న తమ ఆశ్రితులకు క్షమాభిక్ష పేరుతో జైలు నుంచి గడువుకు ముందే విడుదల చేస్తున్నారు. నేరస్థులకు బహిరంగంగా బీజేపీ స్వాగతం చెబుతూ సన్మానాలు చేస్తున్నారు. స్వతంత్ర జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను మతోన్మాదులు హత్యలు చేస్తే కనీసం కేసులు పెట్టలేని నిస్సహాయస్థితిలో ఈ దేశం ఉంది. మోదీ పాలనలో రాజ్యాంగం, చట్టాలు, న్యాయం మృగ్యమయ్యాయి. బీమా కోరెగాంలో ర్యాలీ జరిగితే మేథావులను అరెస్టుచేసి అర్బన్ నక్సలైట్లు అనే పేరుతో విచారణ లేకుండా జైళ్లలో నిర్బంధించారు. హిందూత్వ రాజకీయాలను వ్యతిరేకించేవారు చేసిన ప్రదర్శనపై బీజేపీవారు దాడులుచేసి ముగ్గురిని చంపివేస్తే మోదీ హత్యకు కుట్ర పన్నారని 9మందిని అరెస్టుచేసి నిర్బంధించారు. పూర్తి ఆరోగ్యం చెడిపోయి కదలలేని స్థితిలో ప్రొఫెసర్ సాయిబాబాకు, 90ఏళ్లపైబడిన విప్లవకవి వరవరరావులకు, ప్రొఫెసర్లు, జర్నలిస్టులకు, సామాజిక హక్కుల కార్యకర్తలకు బెయిల్ నిరాకరించి జైలుపక్షులుగా మార్చివేశారు. గాంధీని చంపిన గాడ్సే మహాత్ముడని ప్రకటించిన బీజేపీ ఎంపీ ప్రజ్ఞాసింగ్‌పై ఎటువంటి చర్యలు లేవు. రాజస్థాన్‌లో ఆవుని చంపాడనే నెపంతో ముస్లిం రైతును దారుణంగా కొట్టిచంపారు. వీడియోతీసి సోషల్ మీడియాలో పెట్టారు. అయినా ఎలక్ట్రానిక్ మీడియా సాక్ష్యం చెల్లదని కేసుకొట్టి వేశారు. కానీ బీమా కొరెగావ్ కేసులో కంప్యూటర్‌లో సాక్ష్యం ఉందని ఆరోపిస్తూ కేసులు నమోదుచేసి నిర్బంధించారు. బహుళజాతి కంపెనీల దోపిడీని ప్రతిఘటించిన వారిని అరెస్టులుచేసి హింసిస్తున్నారు. అడవులు, సముద్రాలు, మైదానప్రాంతాలు, పర్యావరణాన్ని నాశనం చేస్తున్న బహుళజాతి కంపెనీలకు పాలకులు దాసోహం అని వత్తాసు పలుకుతున్నారు. యురేనియం తవ్వకాలు విచ్చలవిడిగాచేసి నేటి కాలుష్యానికి పాల్పడుతున్నారు. కోర్టులు, చట్టాలు చివరకి సీబీఐ, ఇన్‌కంట్యాక్స్‌వంటి సంస్థలను సైతం తమ కుట్రపూరిత రాజకీయాలకు పావులుగా వినియోగించుకుంటున్నారు. హిట్లర్, ముస్సోలినీ మార్గంలో ఏకజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తున్నారు. ఇటీవల కాలంలో దేశంలో జరుగుతున్న సంఘటనలు ప్రజాస్వామ్య వాదులను తీవ్ర అందోళనకు గురిచేస్తున్నాయి. ఫ్రాన్స్‌ను పాలించిన 14వ లూయీ "రాజ్యమంటే నేనే" అని చెప్పాడు. నేడు నరేంద్ర మోదీ పాలన కూడా అలాగే ఉంది. నేనే రాజ్యం! నా చేతిలో రాజదండం ఉంది. నేనుచెప్పిందే శాసనం అనేరీతిలో పాలన సాగుతున్నది. ప్రజాస్వామ్యం పేరుతో నియంతల పాలన సాగించాలని ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగమే రైతులపై కారుతో దాడిచేసిన మంత్రిని సమర్థించటం. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన స్వంతపార్టీ పార్లమెంటు సభ్యుడ్ని కాపాడటం. ప్రజాస్వామ్య విలువలకు పాతరవేస్తూ ఒకే పౌరస్మృతి తీసుకువస్తామని చెబుతున్నారు. ఒకే పౌరస్మృతి పేరుతో మను ధర్మశాస్త్రాన్ని చట్టబద్ధం చేయాలని మోదీప్రభుత్వం భావిస్తున్నది. అందుకే డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని ప్రపంచమంతా ఆమోదించినా దానిని పాఠ్యగ్రంథాల నుండి తొలగించే చర్యలకు మోదీ ప్రభుత్వం పూనుకుంది. మతం రంగుపులిమి మణిపూర్ రాష్ట్రాన్ని రావణకాష్టం చేసింది మోదీ పాలనే. ప్రజాస్వామ్యాన్ని తుంగలోతొక్కి అక్కడ ఒకవర్గం ప్రజలపై దాడులు జరిపించటం, దానికి పాలకపక్షం ప్రత్యక్షపాత్ర వహించటం దుర్మార్గం. రాజ్యాంగాన్ని తుంగలోతొక్కి ఇప్పుడు ఉమ్మడి పౌరస్మృతిని తెస్తామని, ఒకే దేశం ఒకే ఎన్నిక పేరుతో తమ అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలని బీజేపీ ప్రభుత్వం భావిస్తున్నది. ఇప్పటికే రామమందిరం, ఆర్టికల్ 370 రద్దు, కాశ్మీర్ విభజనవంటి అంశాలలో ఏకపక్షంగా వ్యవహరించిన మోదీ ప్రభుత్వం 'ఒకే దేశం, ఒకే ఎన్నిక ఒకే నాయకుడు' నినాదం ముందుకుతెచ్చి జర్మన్ నియంత హిట్లర్‌లాగా దేశాన్ని ఏలాలనే దుష్టతలంపులతో ఉన్నారు. మోదీ నియంతృత్వ ధోరణిలో భాగమే ఇప్పుడు దేశం పేరుతో 'ఇండియా' అనే దానిని తొలగించాలనే ప్రయత్నం. ఇండియా అంటేనే భారత్ అని అర్థం. ఇప్పుడు ఇండియాపేరు తొలగిస్తే ఆధార్‌కార్డు దేశకరెన్సీతో సహా అనేక వ్యవహారాలలో పేరుమార్పులు చేయాలి. ఒక్క పదం మార్పుచేస్తే 50వేల కోట్ల రూపాయలు ప్రజాధనం ఖర్చు అవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. నేటి దేశ పరిస్థితులలో ఈ ఖర్చు పెనుభారం కాగలదు. దేశంలో పేదరికం, నిరుద్యోగం, అవినీతిని నిర్మూలించకుండా పేరుమార్చటం ద్వారా పాలకులు ఏమి సాధించదలచుకున్నారో అర్థం కాదు. ప్రజల మౌలిక అవసరాలైన 'తిండి, గుడ్డ, గూడు' గూర్చి ఆలోచించకుండా, విద్య, వైద్యం ప్రజలకు చేరువచేసే ఆలోచనచేయకుండా ప్రజాస్వామ్య వ్యతిరేక, నియంతృత్వ పోకడలను అనుసరించడం దేశప్రయోజనాలకు ఎటువంటి మేలుచేయదు. "స్వేచ్ఛ కోసం ప్రజాస్వామ్యం" ఉండాలని ప్రముఖ తత్వవేత్త అరిస్టాటిల్ చెప్పారు. అందువల్ల ప్రజాస్వామ్య దేశంలోనైన ప్రజలే అంతిమ నిర్ణేతలు, ప్రభువులు. ఇప్పుడు భారత ప్రజాస్వామ్యం తీవ్ర ప్రమాదంలో ఉంది. దానిని రక్షించుకోవలసిన బాధ్యత ప్రజలదే. 'ఒక్కసారి నియంతృత్వానికి చోటు దొరికితే తీవ్రఅనర్థాలకు దేశం బలికాకతప్పదు. అందుకే ప్రజలు ఆలోచించాలి. నవభారత నిర్మాణానికి శక్తివంచనలేకుండా కృషిచేయాలి. అందుకు అనుగుణమైన ప్రజాస్వామిక ప్రత్యామ్నాయాన్ని రాజకీయ రంగంలో నెలకొల్పాలి.

(సెప్టెంబరు 15 ప్రజాస్వామ్య దినోత్సవం సందర్భంగా)

సెల్ : 94909 52093

రాజీ సూత్రంతోనే దిల్లీ డిక్లరేషన్



మక్కెన సుబ్బారావు

జి-20 మనుగడను కాపాడిన దిల్లీ డిక్లరేషన్ భారత ప్రభుత్వం తనకు వరుసక్రమంలో తొలిసారి దక్కిన గ్రూపు 20 దేశాల అధ్యక్షస్థానాన్ని కీర్తికిరీటంగా భావించి సాటిలేదన్నరీతిలో ఈ నెల 9,10 తేదీల్లో దిల్లీలో నిర్వహించిన 18వ అగ్రనాయక సమ్మిట్ స్థూలంగా విజయ వంతమైనట్లు చెప్పవచ్చు. జి20లో అభివృద్ధిచెందిన దేశాల ఆర్థిక కూటమి జి7 కీలకం, శక్తిమంతం. ఇది ప్రధానంగా ఆర్థిక కూటమి. ప్రపంచార్థిక వ్యవస్థకు మార్గదర్శి. నాటి సొంత ఆర్థిక వ్యవస్థలే మాంద్యం, సంక్షోభం వంటి రుగ్మతలతో సతమతమవుతుండగా, తమ బుర్రలకు మరికొన్నింటిని జోడించేందుకు వర్ధమాన ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలను కూడగట్టి 1999లో జి20 ఏర్పాటు చేశారు. అయినా జి7 తనఅస్థిత్వాన్ని కొనసాగిస్తూనే ఉంది. జపాన్ ప్రస్తుతం దాని అధ్యక్షస్థానంలో వుంది. కాబట్టి భౌగోళిక రాజకీయ అంశాలపై జి-7 తనసొంత పంథాలో ముందుకు సాగుతున్నది. తమ సమిష్టి అభిప్రాయాన్ని జి20 వేదికమీదకు కూడా తెస్తుంటుంది. 2022 ఫిబ్రవరిలో రష్యా-ఉక్రెయిన్‌పై సైనికదాడి ప్రారంభించడం తెలిసిందే. అంతకు కొద్ది సంవత్సరాల ముందు నల్లసముద్ర తీరం ఓడరేవు నగరంగా ఉన్న క్రిమియా ప్రాంతాన్ని రష్యా ఆక్రమించుకుంది. సూక్ష్మంగా దీని మూలంలోకి వెళితే, రష్యా భద్రతకు హామీఇచ్చిన ఒప్పందాన్ని నాటో, యూరప్ ఉల్లంఘించాయి.

ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో సోవియట్ యూనియన్ (వార్సాకూటమి) ను ఎదుర్కొన్న పేరుతో అమెరికా, పశ్చిమదేశాలు నాటో సైనిక కూటమి ఏర్పరుచుకున్నాయి. సోవియట్ యూనియన్ పతనంతో వార్సా కూటమి రద్దయింది. నాటో అవసరం తీరినందున అదీ రద్దు కావాలి. కాని అది కొనసాగటమేగాక కొత్త దేశాలను చేర్చుకుంటూ విస్తరిస్తున్నది. ఉక్రెయిన్‌ను చేర్చుకుంటే నాటో సైన్యాలు రష్యా సరిహద్దుకు వస్తాయి. అది తన భద్రతకు ముప్పు తెస్తుందని, అందువల్ల ఉక్రెయిన్‌ను చేర్చుకోవద్దని రష్యా వాదించినా నాటో ఆ ప్రయత్నాలు కొనసాగించింది. అది ఉక్రెయిన్‌పై రష్యా సైనికదాడికి దారి తీసింది. అమెరికా, పశ్చిమదేశాలు ఉక్రెయిన్‌కు అత్యాధునిక ఆయుధాలు సమకూర్చుతూ, ఆర్థికంగా ఆదుకుంటూ యుద్ధానికి ఆజ్యం పోస్తున్నాయి. దీంతో భద్రతామండలి అచేతనమైంది. జి-20లో ఏ తీర్మానమైనా, డిక్లరేషన్ అయినా ఏకగ్రీవంగా జరగాలన్నది రూలు. బాలీ (ఇండోనేషియా)లో జరిగిన గత సమ్మిట్ ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని ఖండించింది. అదే పదబంధం దిల్లీ డిక్లరేషన్‌లో కొనసాగాలన్నది పశ్చిమదేశాల వాదన, రష్యా, చైనా అధ్యక్షులు వేర్వేరు కారణాలతో దిల్లీ సభకు హాజరుకాకపోగా, బాలీ ఫార్ములాను తోసిపుచ్చారు. దీంతో డిక్లరేషన్ తుదిరూపంపై తీవ్రమైన ఉత్కంఠ. డిక్లరేషన్ జారీ కాకపోతే దిల్లీ సమ్మిట్ విఫలమైనట్లే. జి20 గ్రూపు విచ్ఛిన్నమైనట్లే, చివరకు అటు జపాన్, ఇటు ఇండోనేషియా, ఇండియా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా (వరుసగా జి-20 ఆతిథ్యదేశాలు)చొరవతో రాజీఫార్ములా సాధ్యమైంది. అది ఉక్రెయిన్ యుద్ధంలో వివిధ జి20 సభ్యుల భిన్నవైఖరులను ప్రస్తావించింది. " ఏ రాజ్యం భౌగోళిక సమగ్రత, సార్వభౌమాధికారం లేదా రాజకీయ స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా భౌగోళిక ఆక్రమణకై బలప్రయోగానికి దిగుతామని బెదిరించడం లేదా ఉపయోగించటం నుండి అన్ని దేశాలూ వెనకు తగ్గాలి" అనే సాధారణ ఫార్ములాను చేర్చారు. రష్యా పేరు ప్రస్తావించలేదు. గత్యంతరంలేక అమెరికా, యూరోపియన్ యూనియన్ ఈ ఫార్ములాను అంగీకరించవచ్చు. పశ్చిమ దేశాల దిగజారుడును ఉక్రెయిన్ అధ్యక్షుడు ఖండించగా జర్మనీ తదితర దేశాలు సమర్థించుకున్నాయి. ఇదేమైనా యుద్ధం క్షేత్రస్థాయిపై ప్రభావం చూపుతుందా? లేదు. ఉక్రెయిన్‌కు అణుఫిరంగి తూటాలు ఇవ్వనున్నట్లు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కొద్దిరోజుల క్రితం చెప్పారు. శాంతిస్థాపన అమెరికా, పశ్చిమదేశాల ఉద్దేశంకాదు. ప్రచ్ఛన్నయుద్ధంనాటికి పరిస్థితులను సృష్టించడం, రష్యా, చైనాలను కృంగదీయడం వాటి ధ్యేయం. అందుకు ఉక్రెయిన్ కార్యక్షేత్రమైంది. ఇండో-చైనా సముద్రప్రాంతంలో చైనా ఆధిపత్యాన్ని అడ్డుకునే ప్రయత్నంగా భారత్, ఆస్ట్రేలియా, జపాన్‌లతో కలిసి అమెరికా ఏర్పాటుచేసిన క్వాడ్ అలయన్స్, ఆస్ట్రేలియా, బ్రిటన్‌తో కలిసి ఏర్పాటుచేసిన ఆకస్(ఏయూకేయూఎస్) కూటమి ఈ సందర్భంగా గమనార్హం. ఆసియాకు నాటోను విస్తరించే అమెరికా దురాలోచనను చూడవచ్చు. భారత్ అప్రమత్తంగా ఉండాలి. ఉక్రెయిన్ యుద్ధం అనే భౌగోళిక రాజకీయ అంశంపై రాజీఫార్ములాతో వెలువడిన జి-20 నాయకులు దిల్లీ సమ్మిట్ డిక్లరేషన్ ఆ విధంగా సమ్మిట్ విజయవంతమైందనిపించింది. అయితే ప్రత్యేకించి గమనించాల్సిన అంశాలు అనేకం ఉన్నాయి. వాటిలో మొదటిగా చెప్పుకోవలసింది 55దేశాలతో కూడిన ఆఫ్రికన్ యూనియన్. అత్యంత వెనుకబాటుతనంతో కొట్టుమిట్టాడుతున్న ఆఫ్రికన్ యూనియన్‌కు జి20లో శాశ్వత సభ్యత్వం ఇవ్వటం. ఆఫ్రికాలో పుష్కలంగా ఉన్న ఖనిజ సంపద దోపిడీకి గురవుతున్నది. అందువల్ల తమ ఖండంలోని పెట్టుబడులను, పారిశ్రామికీకరణను ఆఫ్రికా కోరుతున్నది. జి20లో ఇప్పటివరకు ఒక ప్రాంతీయ కూటమిగా, యూరోపియన్ యూనియన్ ఒక్కటే ఉంది. జి20 బహుశా ఇకపై గ్రూపు 21గా మారవచ్చు. ప్రపంచం ఎదుర్కొంటున్న భూతాపం సమస్య అత్యంత ప్రధానమైంది. 2050నాటికి 'నెట్ జీరో'(పెరుగుదలను పూర్తిగా అరికట్టడం) సాధించేందుకుగాను వర్ధమాన దేశాలకు 2030 ముందుకాలంలో 5.8-5.9 ట్రిలియన్ డాలర్లు అవసరమన్న అంచనాను డిక్లరేషన్ అంగీకరించింది. కాలుష్యరహిత సాంకేతిక కోసం 2030వరకు ఏటా 4 ట్రిలియన్ డాలర్లు అవసరాన్ని గుర్తించింది. న్యాయంగా అయితే ఈ సొమ్మును పారిశ్రామికంగా అభివృద్ధిచెందిన దేశాలు పూర్తిగా భరించాలి. ఎందుకంటే, అవి రెడు మూడువందల సంవత్సరాలుగా పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. 2020వరకు ఏటా 100 బిలియన్ డాలర్లు సమీకరించి 2025 వరకు వర్ధమానదేశాలకు బదిలీచేయాలని 2010లో అంగీకరించినప్పటికీ నెరవేర్చింది బహుస్వల్పమే. ఈ వాగ్దానాన్ని దిల్లీ డిక్లరేషన్ పునరుద్ఘాటించింది.

ఇందులో ప్రధానమైన పార్శ్వం కర్బన ఇంధనాల వినియోగం తగ్గించటం. అంటే పునర్వినియోగ ఇంధనాల ఉత్పత్తి పెంపుచేయాలి. ఇందుకుగాను జి-20 వెలుపల కొన్ని దేశాల చొరవతో ప్రపంచ జీవఇంధన అలయెన్స్ ఈ సందర్భంగా ఏర్పడింది. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్‌లో 20శాతం ఎథనాల్ కలిపే ఈ కృషిలో చేరాల్సిందిగా జి20 దేశాలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. అమెరికా, బ్రెజిల్, బంగ్లాదేశ్, ఇటలీ, అర్జెంటీనా, మారిషస్, దక్షిణాఫ్రికా, యుఎఇ, కెనడా, సింగపూర్ ఈ చొరవలో పాత్రధారులు. దీనికల్లా ఆహారోత్పత్తికి భంగం వాటిల్లరాదని ముందస్తు హెచ్చరికలు వినిపించాయి. ఎకనామిక్ కారిడార్: ఇండియా- మధ్య ప్రాచ్యదేశాలు, యూరప్ ఎకనామికల్ కారిడార్ ఆర్థికరంగంలో మరో చొరవ. భారత్, అమెరికా, సౌదీ అరేబియా, యునైటెడ అరబ్ ఎమిరేట్స్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, యూరోపియన్ యూనియన్ దీన్ని ప్రకటించాయి. ఇది ఒకరకంగా చైనా వారి 'బెల్ట్ అండ్ రోడ్' ఇనీషియేటివ్(బిఆర్ఐ)కు పోటీ. అయినా చైనా దీన్ని ఆహ్వానిస్తూనే, అది "భౌగోళిక రాజకీయాలకు పనిముట్టు" కారాదని వ్యాఖ్యానించింది. నల్ల సముద్రంపై ధాన్యం రవాణా సమస్య ప్రపంచ ఆహార భద్రతకు, సరఫరాల గొలుసుకు రష్యా, ఉక్రెయిన్ఎంత ప్రధానమైనదో ఉక్రెయిన్ యుద్ధం వెలుగులోకి తెచ్చింది. ప్రపంచ ధాన్యం వ్యాపారంలో వాటిది 23శాతం, 2022లో ఆకలి దేశాల మధ్య ఐరాస చొరవతో రష్యాతో ఒప్పందం జరిగింది. అది ఉక్రెయిన్ ధాన్యం, ఎరువుల ఎగుమతిని నల్లసముద్రం రేవుల గుండా అనుమతిచ్చింది. అయితే రష్యాకిచ్చిన హామీలను పశ్చిమదేశాలు నెరవేర్చనందుకు రష్యా ఇటీవల ఆ ఒప్పందం నుండి వైదొలిగింది. అప్పటివరకు రష్యా నల్ల సముద్రం కారిడార్ ద్వారా 33 మిలియన్ టన్నుల ధాన్యం ఎగుమతి చేసింది. అందులో 33శాతం పశ్చిమదేశాలు, 14శాతం టర్కీ, కొద్దిగా ఆఫ్రికా కొనుగోలు చేశాయి. ఈ ఒప్పందం పున రుద్ధరణకు జి20 సమ్మిట్ సందర్భంలో ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెరస్, టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్, రష్యా విదేశాంగమంత్రి సెర్జి లవరోవ్, ఈయూ నాయకులు చర్చలు జరిపారు. రష్యాపై అమెరికా, ఈయూ ద్రవ్య ఆంక్షలు కొనసాగుతున్నప్పటికీ, దానికివెసులుబాటు కల్పించేట్లు, అది ధాన్యం ఎగుమతి చేస్తున్నా ఉక్రెనియన్ రేవులు, ఓడలపై బాంబులు వేయకుండా ఉండేట్లు అవగాహనకోసం ప్రయ త్నిస్తున్నట్లు గుటెరస్ చెప్పారు. ముందు ఎగుమతులు అనుమతించింది. మీ ఎగుమతులకు ఉపశమనం కొన్ని నెలల తరువాత లభిస్తుందంటే కుదరదు. స్విఫ్ట్ పద్ధతిలో రష్యన్ బ్యాంకులకు అవకాశం ఇవ్వాలి. దాని ద్వారా ధాన్యం, ఇతర ఎగుమతులకు బీమా సౌకర్యం అనుమతించాలి అన్నారు లవరోవ్. జి-20 దిల్లీ డిక్లరేషన్ ఈ సమస్యపై ఇలాచెప్పింది. "రష్యన్ ఫెడరేషన్, ఉక్రెయిన్‌ల నుండి ధాన్యం, ఆహారపదార్థాలు, ఎరువుల సరఫరాలు తక్షణం, నిర్నిరోధకంగా రవాణా జరిగే చర్యలను సంపూర్ణంగా, సకాలంలో సమర్థవంతంగా అమలు జరిగేట్లు చూడాలి". భారతీయత ఉట్టిపడేట్లు నరేంద్రమోదీ సారథ్యంలో అట్టహాసంగా శిఖరాగ్రసభ జరిగింది. అధ్యక్షుడు జో బైడెన్ భారత్ బయలుదేరేముందే ఆయనకోర్కెమేరకు వ్యవసాయోత్పత్తులపై (బాదం,కోడికాళ్లు దిగుమతులపై సుంకాలు తగ్గించి అయన్ను సంతోషపరిచారు. కానీ దేశీయ ఉత్పత్తిదారులతో కన్నీరు పెట్టించారు. ఇదీ ఆయన సబ్ కా సాథ్ సబ్‌కా వికాస్.

సీనియరు జర్నలిస్టు
సెల్: 93906 83756

బీజేపీ, జేడీయూ మాటల యుద్ధం

- నితీశ్ ప్రజా విశ్వాసం కోల్పోయాడన్న కాషాయ పార్టీ
- జీ-20లో బీహారీలను హేళన చేశారన్న నితీశ్ పార్టీ

పాట్నా: ఢిల్లీలో జీ20 సమావేశాల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మధ్య జరిగిన ఆహ్లాదకర సమావేశం తర్వాత బీజేపీ, జేడీ(యూ) మధ్య మాటలయుద్ధం చోటుచేసుకుంది. మోదీ, నితీశ్ మధ్య ఆహ్లాదకర సమావేశాన్ని ఎక్కువగా ఊహించుకోవలసిన అవసరం లేదని బీజేపీ సీనియర్ నేత సంజయ్ జైస్వాల్ బుధవారం నొక్కి చెప్పారు. కొన్ని నెలల క్రితం వరకు బీజేపీ బీహార్ విభాగానికి నాయకత్వం వహించిన జైస్వాల్... నితీశ్ కుమార్‌కు చెందిన జేడీ(యూ)తో సంబంధాల అవకాశాన్ని తోసిపుచ్చారు. కూటమిలో రెండు పార్టీలు ఉన్నప్పుడు ముఖ్యమంత్రి 'బాధ్యత' అని తెలిపారు. సెప్టెంబరు 16న ఝంఝార్‌పూర్‌లో ఒక రోజు పర్యటనకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రానున్నారు. ఈ పర్యటన ఏర్పాట్లను జైస్వాల్ పరిశీలిస్తూ ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. అమిత్‌షా సశాస్త్ర సీమబల్‌కు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు బహిరంగ సభలో ప్రసంగించే అవకాశం ఉంది. నితీశ్ కుమార్‌ను తిరస్కరించిన తర్వాత ఇటీవల ఎన్‌డీఏలో చేరిన మాజీ ముఖ్యమంత్రి జితిన్ రామ్ మాంఝీ తిరిగి మారడంపై నెలకొన్న ఆందోళనల గురించి ప్రశ్నించగా, 'ఢిల్లీలో జరిగింది సాధారణ మర్యాద మాత్రమే. ఈ విషయాలను ఎక్కువగా చూడకూడదు' అని జైస్వాల్ అన్నారు. '2025లో అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పుడు బీహార్‌లో పూర్తి మెజారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని మేము నిశ్చయించుకున్నాము. నితీష్ కుమార్ వద్దకు తిరిగి వెళ్లే ప్రశ్నే లేదు. ఆయన ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని దాదాపు సమాన స్థానాల్లో పోటీ చేసిన మేం 74 స్థానాల్లో గెలుపొందగా, జేడీ(యూ) 50 స్థానాలు కూడా గెలవకపోవడాన్ని మీరు ఎలా వివరిస్తారు' అని జైస్వాల్ ప్రశ్నించారు. మరో ఎన్‌డీఏ మిత్రపక్షం చిరాగ్ పాశ్వాన్ సహాయంతో అసెంబ్లీ ఎన్నికల్లో తన సంఖ్యను తగ్గించేందుకు బీజేపీ కుట్ర పన్నిందని జేడీ(యూ) ఆరోపించడం గమనార్హం. అప్పుడు అవిభక్త లోక్ జనశక్తి పార్టీకి సారథ్యం వహించిన పాశ్వాన్, జేడీ(యూ) పోటీ చేసిన అన్ని స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టారు. ఎల్‌జేపీ అభ్యర్థులలో చాలా మంది బీజేపీ రెబెల్స్‌గా ఉన్నారు. వారు ఆ సమయంలో పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. కానీ ఇప్పుడు తిరిగి పార్టీలో ఉన్నారు. ఇదిలాఉండగా, బీహార్ రాజధానిలోని జేడీ(యూ) రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి, ఎమ్మెల్సీ నీరజ్ కుమార్ సమావేశంలో ప్రపంచ వారసత్వ ప్రదేశం అయిన పురాతన నలంద మహావిహార శిథిలాల చిత్రాన్ని మాత్రమే ప్రదర్శించడం ద్వారా కేంద్రం 'బీహార్ ప్రజలను హేళన చేసింది' అని ఆరోపించారు. 'జీ20 సమావేశంలో పురాతన నలంద మహావిహారం, ప్రపంచ వారసత్వ ప్రదేశం. 'కొన్ని కిలోమీటర్ల దూరంలో ఆధునిక నలంద అంతర్జాతీయ విశ్వవిద్యాలయం వచ్చింది. దీని కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు సహాయం అందించడానికి అంగీకరించాయి. ఈ ప్రాజెక్టును ప్రస్తావించేందుకు ప్రధాని మోదీ సిగ్గుపడుతున్నారా' అని నీరజ్ కుమార్ ప్రశ్నించారు. అలాగే బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ కూడా 'చైనా తన సహాయాన్ని ఉపసంహరించుకునేలా చేయడం ద్వారా ప్రాజెక్టుకు అడ్డంకులు వేశాయని జేడీ(యూ) ఎమ్మెల్సీ ఆరోపించారు. 'నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ విషయాన్నే చూస్తే ఆయన వారి భావజాలాన్ని తీవ్రంగా విమర్శించారు. యూనివర్సిటీ ఛాన్సలర్ పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో చాలా తక్కువ విషయం ఉన్న విద్యావేత్తను నియమించడం బీజేపీ పక్షపాత వైఖరి స్పష్టంగా కనిపిస్తుంది' అని ఆయన ఆరోపించారు. 'ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త రామ్ మాధవ్ చేసిన పరువు నష్టం కలిగించే ట్వీట్లతో విదేశాలకు చెందిన మరో ప్రఖ్యాత అధ్యాపకుడు రాజీనామా చేయాల్సి వచ్చింది. పైగా, దీనిని నలంద అంతర్జాతీయ విశ్వవిద్యాలయం అని పిలుస్తుంటారు. కానీ బౌద్ధమతంలో ఎటువంటి కోర్సులు అందించకపోవడం హాస్యాస్పదం' అని జేడీ(యూ) నాయకుడు అన్నారు. 'విశ్వవిద్యాలయంలో సమగ్ర మానవతావాదం (దివంగత ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ప్రతిపాదించిన భావజాలం), మొత్తం రాజకీయ శాస్త్రం (ప్రధాన మంత్రి మోదీ డిగ్రీని ప్రస్తావిస్తూ) డిగ్రీలు అందించాలని కేంద్రం ప్రతిపాదించడం పట్ల నేను ఆశ్చర్యపోతున్నాను. బీహార్ పునరుజ్జీవనో దశలో ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దానిని సహించలేకపోతోంది' అని ఆయన అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్రంలో చేసిన ప్రయత్నాల కారణంగానే ఐక్యరాజ్య సమితి బీహార్ ముఖ్యమంత్రిని 'వాతావరణ నాయకుడిగా' ప్రకటించిన విషయం గురించి ప్రస్తావించలేదని తెలిపారు.

సుప్రీం ఆవరణలో సరదా సరదాగా సీజేఐ

న్యూఢిల్లీ: కేసులతో బిజీబిజీగా గడిపే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ బుధవారం అత్యున్నత న్యాయస్థానం పరిసరాల్లో సరదాగా తిరిగారు. కేఫ్‌టేరియాకు వెళ్లి సహచర న్యాయమూర్తులతో కలిసి సమోసా తిని...టీ తాగారు. సీజేఐ నిరాడంబరతకు సహచర న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఆశ్చర్యపోయారు. సుప్రీంకోర్టు కార్యకలాపాలు ప్రారంభమైన తరువాత ఐదుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంతో కలిసి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఓ కేసు విచారణ పూర్తి చేశారు. అనంతరం కాసేపు విరామం ప్రకటించారు. జస్టిస్ హృశికేశ్ రాయ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కలిసి ఆయన కోర్టు పరిసరాల్లోకి వచ్చారు. తొలుత కేఫ్‌టేరియాలోకి ప్రవేశించిన న్యాయమూర్తులు సమోసాలు తిని, చాయ్ తాగారు. అనంతరం నూతన ఎలక్ట్రానిక్ పాస్‌లు ఎలా పని చేస్తున్నాయో పరిశీలించారు. త్వరలో సుప్రీంకోర్టు ప్రాంగణంలోకి అడుగుపెట్టాలంటే ఈ పాసులను తప్పనిసరి చేయనున్నారు. తన ఛాంబర్‌కు తిరిగి వెళ్తూ జస్టిస్ డీవై చంద్రచూడ్ విలేకరులతో సరదాగా ముచ్చటించారు.

జీ20 భద్రతా విధులు భేష్

పోలీసులకు మోదీ ప్రత్యేక విందు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో గతవారం భారత్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన జీ20 శిఖరాగ్ర సదస్సు విజయవంతం కావడంపై ప్రధాని మోదీ సంతోషంలో మునిగిపోయారు. ఆ కార్యక్రమాల్లో పాలుపంచుకున్న ప్రతి ప్రభుత్వ విభాగాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. సుష్మా స్వరాజ్ భవన్‌లోని జీ20 సెక్రటేరియట్‌లో ప్రధాని ఆకస్మికంగా ఆయన పర్యటించారు. ఆయనతో పాటు విదేశాంగమంత్రి ఎస్ జై శంకర్ ఉన్నారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులను పలకరించారు. సదస్సును విజయవంతం చేసేందుకు శ్రమించిన అధికారులకు ఆయన కృజ్ఞతలు తెలిపారు. కాగా, జీ20 భద్రతా విధుల్లో పాల్గొన్న ఢిల్లీ పోలీసులకు ఈ వారంలోనే ప్రధాని విందు ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఢిల్లీ పోలీస్ కమిషనర్ సంజయ్ అరోడా ప్రతి జిల్లా నుంచి పోలీసుల వివరాలు సేకరిస్తున్నారు. కానిస్టేబుల్ మొదలుకొని ఇన్‌స్పెక్టర్ వరకు ఆ జాబితాలో ఉన్నారు. మొత్తం 450 మంది పోలీసులతో జాబితా సిద్ధం చేస్తున్నారు. వారందరినీ జీ20 సదస్సు నిర్వహించిన 'భారత మండపం'లో ప్రధాని కలుసుకోనున్నారు. సీపీ సంజయ్ ఇది వరకే పోలీసులకు ప్రత్యేక ప్రశంస డిస్క్ అభినందన పత్రం అందజేశారు.

గ్రామంపై బాంబు దాడి

ఇంఫాల్: కొద్ది నెలలుగా జాతుల హింసతో అతలాకుతలమైన మణిపూర్‌లో తాజాగా హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. కాంగ్‌పోక్పీ సరిహద్దున గల ఇంఫాల్ పశ్చిమ జిల్లా కౌత్రుక్ గ్రామంపై మంగళవారం అర్ధరాత్రి బాంబు దాడి జరిగింది. ముష్కరులు పది వరకు బాంబులు విసిరి గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేశారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని అధికారులు తెలిపారు. అయితే ఆ ప్రాంతంలో మోహరించిన భద్రతా బలగాలుఎదురు కాల్పులు జరపడంతో ముష్కరులు పరారయ్యారు. కాగా కాంగ్‌పోక్పీ జిల్లాలోని ఖరం వైఫీ గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం నిషిద్ధ తీవ్రవాద గ్రూపునకు చెందినవారు భావిస్తున్న గుర్తుతెలియని సాయుధులు గిరిజన సమాజానికి చెందిన ముగ్గురు వ్యక్తులను చంపేసిన క్రమంలో మళ్లీ దాడులు జరుగుతాయని జిల్లా ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వివిధ ప్రాంతాల్లో ఇంకా ఉద్రిక్తత కొనసాగుతోందని అధికారులు తెలిపారు. కౌత్రుక్ ఇంఫాల్ లోయలో హింసాత్మకంగా దెబ్బతిన్న ప్రాంతాలలో ఒకటి. మే 3న రెండు గిరిజన జాతుల మధ్య ఘర్షణలు చెలరేగినప్పటి నుంచి అనేక మార్లు కాల్పులు జరిగాయి.

అదానీ గ్రూప్ అవినీతిపై జేపీసీతో విచారణ

కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ అవినీతి, అక్రమాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ద్వారా విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. తద్వారా కొత్త భవనంలో పార్లమెంటు కొత్త ఇన్నింగ్స్‌ను ప్రారంభించవచ్చని తెలిపింది. సెప్టెంబర్ 18 నుంచి 22 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. సెప్టెంబర్ 18న పాత భవనంలోనే సమావేశాలు ప్రారంభం కానుండగా... సెప్టెంబర్ 19న గణేష్ చతుర్థి రోజున కొత్త భవనానికి సమావేశాలు మారే అవకాశం ఉంది. కోట్లాదిమంది పెట్టుబడిదారుల ప్రయోజనాల దృష్ట్యా అదానీకి సంబంధించిన కేసులో జోక్యం చేసుకోవాలని కోరుతూ అదానీ సంస్థ మాజీ కాంట్రాక్టర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. 'కొద్ది రోజుల క్రితం అదానీ భారీ కుంభకోణంపై సరిగా దర్యాప్తు చేయడంలో సెబీ విఫలమైందనే దానిపై సవివరమైన డాక్యుమెంటేషన్‌తో సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయబడింది' అని ఆయన పేర్కొన్నారు. 'ఇవన్నీ జేపీసీ వేయడానికి కేసును మరింత బలపరుస్తాయి. ప్రధాని వద్ద నిజంగా దాచడానికి ఏమీ లేనట్లయితే జేపీసీ ప్రకటనతో కొత్త భవనంలో పార్లమెంటు తన ఇన్నింగ్స్‌ను ప్రారంభించవచ్చు' జైరామ్ చెప్పారు.

ప్రజలు మద్దతిస్తే 'ఇండియా'దే అధికారం

శ్రీలంక అధ్యక్షుడితో మమత మాటామంతీ

కోల్‌కతా: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు మద్దతిస్తే... తాము అధికార పగ్గాలు చేపడతామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. ప్రతిపక్ష ఇండియా కూటమికి మీరు నేతృత్వం వహిస్తారా అని శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే ప్రశ్నించగా... ఆయన ప్రశ్నకు మమత నవ్వుతూ పై విధంగా బదులిచ్చారు. దుబాయ్ విమానాశ్రయంలో శ్రీలంక అధ్యక్షుడు విక్రమసింఘేతో మమతా బెనర్జీ బుధవారం సమావేశమయ్యారు. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే బెంగాల్ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌కు హాజరు కావాలని ఆయనను మమత ఆహ్వానించారు. మమతా బెనర్జీ... దుబాయ్, స్పెయిన్‌లో 12 రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం బయలుదేరి వెళ్లారు.

దుబాయ్ విమానాశ్రయ లాంజ్‌లో విక్రమ సింఘే తనను కలిశారని, తాము కొద్దిసేపు సంప్రదింపులు జరిపామని, బెంగాల్ బిజినెస్ సమ్మిట్‌కు తాను ఆయనను ఆహ్వానించానని మమతా బెనర్జీ 'ఎక్స్'లో వెల్లడించారు. విక్రమ సింఘేతో మాట్లాడుతున్న ఫొటోను పోస్ట్ చేశారు. విక్రమ్ సింఘే తనను శ్రీలంక పర్యటనకు ఆహ్వానించారని ఆమె తెలిపారు.

అది హిందూ వ్యతిరేక సమన్వయ కమిటీ

'ఇండియా' కూటమిపై బీజేపీ ఆరోపణ

న్యూఢిల్లీ : సనాతన ధర్మంపై డీఎంకే వ్యాఖ్యల తర్వాత బీజేపీ విపక్ష పార్టీలపై ఆరోపణలు గుప్పించింది. 'ఇండియా' కూటమి సమావేశాన్ని 'హిందూ వ్యతిరేక సమన్వయ కమిటీ' కలయికగా బీజేపీ బుధవారం నిందించింది. బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర ఈ అంశంపై కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రసిద్ధ సస్పెన్స్ పుస్తకం 'మర్డర్, షీ రాట్' తరహాలో ఆమె 'మర్డర్ ఆఫ్ హిందూయిజం, షీ రాట్' అనే పుస్తకాన్ని రాశారని ఆరోపించారు. విపక్షాల సమావేశాన్ని తేలిక చేస్తూ, అవి సీట్ల పంపకంపై మాత్రమే చర్చిస్తాయని అన్నారు. 'ఇండియా' కూటమి సభ్యుల మధ్య సహాయ నిరాకరణ కనిపిస్తోందని ఆయన విలేకరుల సమావేశంలో తెలిపారు. 'హిందూ మతాన్ని ఎలా అంతం చేయాలో వారు చర్చిస్తారు' అని పాత్రా ఆరోపించారు. అందుకే ఉద్ధవ్ ఠాక్రే గోద్రా లాంటి సంఘటన మళ్లీ జరగవచ్చని పేర్కొన్నారు. అయితే రాహుల్ గాంధీ గతంలో హిందూత్వపై దాడి చేయడానికి ఇస్లామిక్ ఉగ్రవాద గ్రూపు ముస్లిం బ్రదర్‌హుడ్‌ను ఉదహరించారు. సోనియా గాంధీ క్రిస్టియన్ పేరును ఉటంకిస్తూ, హిందూ మతాన్ని లక్ష్యంగా చేసుకునే కుట్ర వెనుక ఆమె హస్తం ఉందని ఆరోపించారు.

రెండువర్గాల మధ్య కాల్పులు

ఐదుగురి మృతి, 8మందికి తీవ్ర గాయాలు

దతియా: రెండువర్గాల వారు కాల్పులు జరుపుకున్న ఘటనలో ఐదుగురు మృతి చెందగా... మరో ఎనిమిదిమంది తీవ్రంగా గాయపడ్డారు. మధ్యప్రదేశ్‌లోని దతియా జిల్లాలో ఈ ఘటన జరిగిందని పోలీసులు వెల్లడించారు. రాష్ట్ర హోంమంత్రి నరోత్తమ్ మిశ్రా సొంతగడ్డ అయిన దతియా జిల్లా రెండా గ్రామంలో బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో డాంగి, పాల్ వర్గాలకు చెందిన సభ్యుల మధ్య కాల్పులు జరిగాయి. దతియా జిల్లా ఎస్పీ ప్రదీప్ శర్మ ఈ ఘటనకు గల కారణాలను వివరించారు. మూడు రోజుల క్రితం పశువులను మేపుకునే విషయమై ప్రకాష్ డాంగి, ప్రీతమ్ పాల్ మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో ప్రకాష్... ప్రీతమ్‌ను చెంపదెబ్బ కొట్టాడు. ఆ తర్వాత పరస్పరం ఫిర్యాదులు చేయడంతో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. కాగా బుధవారం ఉదయం మరోసారి రెండు వర్గాల సభ్యులు ఘర్షణపడ్డారని, పరస్పరం కాల్పులు జరుపుకోవడంతో ఐదుగురు మరణించారని, ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారని ఆయన చెప్పారు.కాల్పుల్లో ప్రకాష్ డాంగి, రామ్ నరేష్ డాంగి, సురేంద్ర డాంగి, రాజేంద్ర పాల్, రాఘవేంద్ర పాల్ మరణించారని తెలిపారు. మృతులంతా 30 ఏళ్లు పైబడినవారే. గాయపడిన వారిని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

జైపూర్: రాజస్తాన్‌లోని కోటాలో నీట్ విద్యార్థుల ఆత్మహత్యలు ఆగడంలేదు. తాజాగా మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోగా ఈ ఏడాదిలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల సంఖ్య 25కి చేరింది. జార్ఖండ్‌కు చెందిన రిచా సిన్హా తన హాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరి వేసుకున్నట్లు అధికారులు బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి 10.30 గంటలకు ఈ ఘటన జరిగిందన్నారు. రాంచీకి చెందిన విద్యార్థిని కోటాలో ఉంటూ చదువుకుంటోంది. నీట్ కోసం సిద్ధమవుతోంది. అలాంటిది ఆమె ఆకస్మికంగా ఉరి వేసుకొని చనిపోవడం ఎందుకో తెలియలేదు. ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని పోలీసులు అన్నారు. ఆమె కుటుంబానికి సమాచారం ఇచ్చామని, మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించామని చెప్పారు. విద్యార్థిని ఆత్మహత్యకుగల కారణాలపై ఆరా తీస్తున్నామన్నారు. కోటాలోని విద్యార్థులకు రెండు నెలల వరకు ఎలాంటి పరీక్షలు నిర్వహించకూడదని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశాలిచ్చింది. తీవ్ర మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని సూచనలు చేసింది. అయితే కోటాలో దాదాపు 2 లక్షల మంది విద్యార్థులు ఏటా చదువుకోడానికి వస్తుంటారు. జేఈఈ, నీట్ వంటి పరీక్షల కోసం కోచింగ్ తీసుకునే క్రమంలో ఒత్తిడికి గురవుతున్నారు. ఈ ఏడాది 25 మంది విద్యార్థులు చనిపోయారు. ఇంత మంది విద్యార్థులు ఇలా చనిపోవడం ఎప్పుడు జరగలేదు. రాజస్తాన్ పోలీసుల డేటా ప్రకారం 2018లో 18 మంది, 2016లో 17, 2017లో ఏడుగురు, 2018లో 20, 2019లో 18 మంది, 2022 15 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. 2020, 2021లో మాత్రం ఒక్క ఆత్మహత్య కూడా నమోదు కాలేదు. విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతుండటంపై ప్రభుత్వాధికారులు చర్యలు చేపట్టారు. హాస్టల్స్‌లో పాత ఫ్యాన్‌లు తీసేసి స్ప్రింగ్ లోడెడ్ ఫ్యాన్స్‌ని ఫిట్ చేసే పని చేపట్టారు. ఈ ఫ్యాన్‌కి ఉరి వేసుకోవాలని చూసినా వెంటనే స్ప్రింగ్‌తో సహా కిందకు వస్తుందే తప్ప ఉరి బిగుసుకోదు. ఇక్కడి పీజీలు, హాస్టల్స్‌లో ఈ ఫ్యాన్‌లు అమర్చారు. మానసికంగా విద్యార్థులకు ధైర్యం చెప్పడం హాస్టల్స్ విధి అని, వారి భద్రతపైనా బాధ్యత ఉంటుందని అధికారులు ఇప్పటికే తేల్చి చెప్పారు. ఈ ఆదేశాలను బేఖాతరు చేసిన హాస్టల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అమ్మ చేతి వంట రుచిచూపండి

కేరళ హైకోర్టు

తిరువనంతపురం: అమ్మ చేతి వంటకున్న ప్రాముఖ్యతను కేరళ హైకోర్టు సవివరంగా వెల్లడించింది. ఆన్‌లైన్ ద్వారా ఫుడ్ ఆర్డర్ చేయటాన్ని తగ్గించి పిల్లలకు ఇంట్లో వండే ఆహారాన్ని అలవాటు చేయాలని సూచించింది. రహస్యంగా పోర్న్ చూడటం వ్యక్తిగతమని, ఇటువంటి ఘటనలపై కేసు నమోదు చెల్లదని ఇటీవల జరిగిన ఓ ఘటనపై కేరళ హైకోర్టు తీర్పునిచ్చింది. ఆ కేసు విచారణ సందర్భంగా పిల్లలకు ఇంట్లో వండిన భోజనాన్ని అందించటంలో ఉండే ప్రాముఖ్యత గురించి ప్రత్యేకంగా వివరించింది. 'రెస్టారెంట్ల నుంచి ఆన్‌లైన్ ద్వారా ఫుడ్ కొనటానికి బదులు... అమ్మ వండిన రుచికరమైన ఆహారాన్ని పిల్లలకు అందించండి. పిల్లలను ఆరుబయట ఆడుకునేలా ప్రోత్సహించండి. వారు బాగా ఆడుకొని ఇంటికి తిరిగి రాగానే తల్లి చేతి వంట ఘుమఘుమలు, మైమరిపించే వాసనతో వారికి స్వాగతం పలుకుతూ, రుచికరమైన ఆహారం అందించండి' అని కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ కున్హికృష్ణన్ తల్లులకు సూచించారు. ఇదే సందర్భంలో సరైన పర్యవేక్షణ లేకుండా మైనర్ పిల్లలకు మొబైల్ ఫోన్‌లు ఇవ్వటం వల్ల కలిగే ప్రమాదాల గురించి తల్లిదండ్రులకు హెచ్చరికలు జారీ చేశారు. ఇంటర్నెట్ సదుపాయం ఉన్న మొబైల్ ఫోన్‌ల ద్వారా అశ్లీల వీడియోలు సులభంగా అందుబాటులోకి వస్తాయని, దీని బారిన పిల్లలు పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. వాస్తవంగా...2016లో కొచ్చిలోని అలువా ప్యాలెస్ సమీపంలో రోడ్డు పక్కన 33 ఏళ్ల వ్యక్తి పోర్న్ చూస్తూ పోలీసులకు దొరికాడు. దీంతో ఐపీసీ 292 కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

దీనిపై నిందితుడు హైకోర్టును ఆశ్రయించాడు. తాజాగా ఈ కేసుపై కేరళ హైకోర్టు తీర్పునిచ్చింది. రహస్యంగా పోర్న్ ఫొటోలు, వీడియోలు చూడటం వ్యక్తిగతమని, అటువంటి ఘటనలపై కేసు నమోదు చేయడం చట్టరీత్యా చెల్లదని, అలా చేస్తే వ్యక్తిగత జీవితంలో జోక్యం చేసుకోవడంతోపాటు వ్యక్తిగత స్వేచ్ఛను అడ్డుకున్నట్లే అవుతుందని స్పష్టం చేసింది. పోర్నోగ్రఫీ అనేది శతాబ్దాలుగా కొనసాగుతోందని, డిజిటల్ యుగంలో మరింత విస్తృతంగా అందుబాటులోకి వచ్చిందని తెలిపింది. అలాగే నిందితుడిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేసింది.

యూసీసీ వద్దే వద్దు

నాగాలాండ్ అసెంబ్లీ తీర్మానం... సమర్థించిన బీజేపీ

కోహిమా: ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకిస్తూ నాగాలాండ్ అసెంబ్లీ బుధవారం ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఆర్టికల్ 371ఏ ప్రకారం నాగాలకు ప్రత్యేక రక్షణ ఉందని, అందుకే ఈ బిల్లు రాష్ట్రానికి వర్తించదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్డీపీపీ), బీజేపీ, ఎన్సీపీ, ఎన్పీపీ, ఎల్జేపీ, నాగా పీపుల్స్ ఫ్రంట్, ఆర్పీఐ (అథవాలే), జేడీయూ, ఇండిపెండెంట్లతో సహా అన్ని పార్టీలు బిల్లును వ్యతిరేకించాయి. నాగాల మతపరమైన, సామాజిక ఆచారాలు వేరని ప్రభుత్వం స్పష్టం చేసింది. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానానికి తాము అండగా ఉంటామని నాగాలాండ్ బీజేపీ అధ్యక్షుడు, క్యాబినెట్ మంత్రి టెంజెన్ ఇమ్నా అలాంగ్ హామీ ఇచ్చారు. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) నుంచి రాష్ట్రానికి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ నాగాలాండ్ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ముఖ్యమంత్రి నీఫియు రియో సభలో తీర్మానాన్ని సమర్పిస్తూ నాగాలాండ్ అసెంబ్లీ 14వ సభ రాష్ట్రంలో ప్రతిపాదిత యూసీసీకి సంబంధించి చట్టం నుంచి మినహాయింపును ఏకగ్రీవంగా ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. 'యూసీసీ నాగా ప్రజల సామాజిక పద్ధతులు, మతపరమైన ఆచారాలకు ముప్పు కలిగిస్తుందని నాగాలాండ్ ప్రభుత్వం, నాగా ప్రజలు విశ్వసిస్తున్నారు. యూసీసీని అమలు చేస్తే ఆక్రమణలకు దారి తీస్తుంది' అని ఆయన అన్నారు. వివాహం, విడాకులు, సంరక్షణ, సంరక్షకత్వం, దత్తత, నిర్వహణ, వారసత్వం వంటి వ్యక్తిగత విషయాలపై ఒకే చట్టాన్ని రూపొందించడం యూసీసీ లక్ష్యమని ముఖ్యమంత్రి రియో చెప్పారు. చర్చ ముగింపు ప్రసంగంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాజకీయ ఒప్పందం-16 పాయింట్ల ఒప్పందం, భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 371 ఏ ను చేర్చడం ద్వారా భారత యూనియన్ లో చేరిన ఏకైక రాష్ట్రం నాగాలాండ్ అని అన్నారు. కేంద్రం తన ఒప్పందాన్ని అవమానించదనీ, నాగాలకు ఇచ్చిన రాజ్యాంగ నిబంధనలను విస్మరించదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న బస్సును ఢీకొట్టిన ట్రక్కు
- 12మంది యాత్రికుల దుర్మరణం
- మరో 11మందికి తీవ్ర గాయాలు

జైపూర్: రాజస్తాన్‌లో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. రోడ్డుపై ఆగివున్న బస్సును వెనుక నుంచి వచ్చిన ట్రక్ ఢీకొంది. భరత్‌పూర్ జిల్లాలోని జైపూర్-ఆగ్రా జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బస్సులోని గుజరాత్‌కు చెందిన 12 మంది యాత్రీకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డా రు. గుజరాత్ నుంచి ఉత్తరప్రదేశ్ లోని మథురకు యాత్రీకులతో ఓ బస్సు బయల్దేరింది. బుధవారం తెల్లవారుజామున 4:30 గంటల సమయంలో డ్రైవర్ బస్సును హంత్ర సమీపంలోని ఓ ఫ్లై ఓవర్‌పై రోడ్డు పక్కగా నిలిపాడు. తెల్లవారుజామున చీకటి కారణంగా అదే సమయంలో ఓ ట్రక్కు వేగంగా వచ్చి బస్సు వెనుక భాగాన్ని ఢీ కొట్టడంతో కొంత భాగం నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 12 మంది మృతి చెందారు. అందులో ఆరుగురు పురుషులు, ఐదుగురు మహిళలు అక్కడికక్కడే చనిపోగా మరో మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. హైవే పక్కన మృతదేహాలు చెల్లాచెదురుగా పడి ఉండటంతో అటువైపు వెళ్తున్న వాహన చోదకులు పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన 12 మంది ప్రయాణికులను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో మృతి చెందిన వారంతా గుజరాత్ లోని భావ్ నగర్ జిల్లాలోని దిహోర్ పట్టణానికి చెందిన వారని బస్సులోని మిగిలిన ప్రయాణికులు తెలిపారు.

రాష్ట్రపతి, ప్రధాని, గెహ్లోట్ సంతాపం

మృతుల కుటుంబాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్, రాజస్థాన్ గవర్నర్ కల్‌రాజ్ మిశ్రా ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ప్రమాద వార్త తనను కలచివేసిందని, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు.

ప్రధాని మోదీ మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. గెహ్లోట్ మాట్లాడుతూ... పోలీసులు, ఇతర అధికార యంత్రాంగం ఘటనా స్థలి వద్ద సహాయ చర్యలు చేపట్టారని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు.

జగన్ అరాచకానికి పరాకాష్ఠ

చంద్రబాబు అరెస్టుపై బొండా ఉమా
టీడీపీ నిరశన దీక్షకు సీపీఐ నేతల సంఘీభావం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసిన తీరు... రాష్ట్రంలో జగన్ అరాచకానికి పరాకాష్ఠ అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా బుధవారం ధర్నాచౌక్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సామూహిక నిరశన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన నేతపై ప్రభుత్వం, పోలీసులు వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో అరాచక పాలన సాగుతోందన్నారు. జగన్ ప్రభుత్వం ఒక పథకం ప్రకారం స్కిల్ డెవలప్‌మెంట్ లో వందల కోట్ల అవినీతి జరిగిపోయిందని దుష్ప్రచారం చేస్తూ... చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టిందని, దీనికి తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. ఈనెల 19న హైకోర్టులో విచారణ సందర్భంగా వాస్తవాలను బయటపెడతామని, జైలు నుంచి చంద్రబాబు కడిగిన ముత్యం లాగా బయటికి రాబోతున్నారని తెలిపారు. టీడీపీ నాయకులు,కార్యకర్తలు అరెస్టులకు,అక్రమ కేసులకు భయపడేది లేదన్నారు. ఈ ధర్నా చౌక్ లో గాంధేయ మార్గంలో నిరసన వ్యక్తం చేయడానికి కూడా పోలీసులు పర్మిషన్ ఇవ్వడానికి అనేక ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. ఈ నిరసన దీక్షకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు బృందంగా వచ్చి సంఘీభావం తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని నడిరోడ్డుపై నరికేశారు: ముప్పాళ్ల

అనంతరం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్యాన్ని నడిరోడ్డు మీద నరికి వేస్తున్నారన్నారు. గతంలో వెనుకబడిన బీహార్ రాష్ట్రంలో ఇలాంటి దుర్మార్గాన్ని చూశామన్నారు. కారణాలు ఏమైనా ప్రజలు ఇచ్చిన ఒక మంచి అవకాశాన్ని ఉపయోగించుకుని రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అన్ని పార్టీలను కలుపుకుని పాలన చేయాల్సిన వ్యక్తి... ఆదిలోనే ప్రజా వేదికని కూల్చడం ద్వారా విధ్వంస పాలన మొదలు పెట్టారన్నారు. చౌకగా ఉన్న ఇసుకని అర్ధాంతరంగా ఆపేసి 70 మంది ఆత్మహత్యకు కారణమయ్యారన్నారు. నేడు సామాన్యులకు ఇసుక అందుబాటులో లేకుండా పోయిందన్నారు. ఇసుక అంటే అదేదో బంగారానికి మించిన వస్తువుగా మార్చిన వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ... సీఎం జగన్ ప్రజా వేదిక కూల్చడంతో మొదలుపెట్టి రివర్స్ పాలన చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పోలీసులతో ప్రజా ఉద్యమాలను అణిచివేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు అంతర్జాతీయంగా గుర్తింపు ఉన్న వ్యక్తి అని... రాజకీయ కుట్రతోనే చంద్రబాబుని అక్రమంగా అరెస్టు చేశారన్నారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధి కోసం చేసిన పనులన్నింటిని రివర్స్ టెండర్ ద్వారా నిలిపివేశారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి కొన్ని వేల కోట్ల అవినీతికి పాల్పడి... జైలు జీవితం గడిపి వచ్చారు కనుకే తనలాగే చంద్రబాబును జైలుకు పంపాలనే కుట్రతోనే ఇదంతా చేశారని ఆరోపించారు. బాబాయ్ హత్య కేసులో ముద్దాయిగా ఉన్న అవినాశ్‌రెడ్డి అరెస్టునకు రాష్ట్ర పోలీసులు గానీ, సీబీఐగానీ సహకరించలేదన్నారు. నరేంద్ర మోదీ సలహా లేకుండా జగన్‌మోహన్ రెడ్డి చంద్రబాబుని అరెస్టు చేసే అవకాశం లేదన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో ముస్లిం మైనార్టీ నాయకులు ఫరూక్ షుబ్లీ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ ఉన్నారు. ఈ నిరసన ధర్నాలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, ఎర్రబోతు రమణారావు, గంటా కృష్ణమోహన్ కార్పొరేటర్ వీరమాచనేని లలిత, వల్లభనేని సతీశ్, గొట్టుముక్కల రఘురామ రాజు, దాసరి ఉదయశ్రీ, సంధి రెడ్డి గాయత్రి, ఇతర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పత్రాలివ్వకపోతే రూ.5 వేలు చెల్లించాల్సిందే

బ్యాంకులకు ఆర్‌బీఐ కఠిన ఆదేశాలు

ముంబై: వ్యక్తిగత రుణం తిరిగి సంపూర్ణంగా చెల్లించిన తర్వాత ఆస్తి పత్రాలు వెనక్కి ఇచ్చే విషయంలో బ్యాంకులు వేధింపులకు గురి చేస్తున్నట్లు రుణగ్రహీతల నుంచి అందిన ఫిర్యా దులపై ఆర్‌బీఐ రంగంలోకి దిగింది. దీనికి సంబంధించి అత్యంత కీలక నిబంధనను తీసుకొచ్చింది. రుణగ్రహీత పూర్తిగా లోన్ చెల్లించిన తర్వాత అతడి వ్యక్తిగత రుణ ఖాతాను మూసివేసి...ఖాతాదారుడికి సంబంధించిన స్థిర లేదా చరాస్తుల పత్రాలు తిరిగి ఇవ్వాలని ఆర్బీఐ స్పష్టమైన ఆదేశం జారీ చేసింది. ఆలస్యమైతే రోజుకు రూ.5000 చొప్పున రుణగ్రహీతకు బ్యాంకులు చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఈ మేరకు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ నిబంధన 2023 డిసెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధనపై సానుకూల అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. నిజాయతీగా రుణాలు చెల్లించే రుణగ్రహీతల ప్రయోజనాలు రక్షించడమే లక్ష్యంగా...లోన్ చెల్లింపు తర్వాత దాక్యుమెంట్లు తిరిగివ్వడంలో ఆర్‌బీఐ మార్గదర్శకాలు ఉపయుక్తంగా ఉంటాయని స్టేబుల్‌ఇన్వెస్టర్ సంస్థ వ్యవస్థాపకుడు, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ దేవ్ ఆశీష్ అభిప్రాయపడ్డారు. సకాలంలో రుణ చెల్లింపులు చేసినప్పటికీ ఆ తర్వాత జరగాల్సిన క్లోజింగ్ దశలో అసమంజసం కాని విధంగా ఆలస్యం చేస్తున్నారని అన్నారు. ఆర్బీఐ తీసుకొచ్చిన ఈ కొత్త నిబంధన చిన్న ఫైనాన్స్ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు సహా అన్ని వాణిజ్య బ్యాంకులకు వర్తిస్తాయి. అన్ని ప్రైమరీ కో-ఆపరేటివ్ బ్యాంకులు, అన్ని స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంకులు, డిస్ట్రిక్ట్ సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకులు, అన్ని ఎన్‌బీఎఫ్‌సీలు, అన్ని అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీలకు వర్తిస్తాయి.

చంద్రబాబుది అక్రమ అరెస్టు: ఆనందబాబు

విశాలాంధ్ర- వేమూరు: ఆధారాలు లేని కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును జైలుకు పంపి... వైసీపీ నేతలు సునకానందం పొందుతున్నారని, ఇది ముమ్మాటికీ అక్రమ అరెస్టేనని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు విమర్శించారు. వేమూరులోని పార్టీ కార్యాలయంలో రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించారు. ఆనందబాబు మాట్లాడుతూ వైసీపీ పాలనపై ప్రజలు విసుగు చెందారని, టీడీపీ ప్రజాదరణ చూసి ఓర్వలేక కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసేందుకు జగన్ ప్రభుత్వం అరెస్టులకు పాల్పడుతోందని మండిపడ్డారు. వ్యవస్థలను మేనేజ్ చేయడం ద్వారా చంద్రబాబుకు బెయిల్ రాకుండా చేసినట్లు ఆరోపించారు. చంద్రబాబు అరెస్టును వైసీపీ సంబరాలు చేసుకుంటుందని, మంత్రులు, ఎమ్మెల్యేలు వరుస మీడియా సమావేశాలతో ఎదురుదాడికి దిగుతున్నారని చెప్పారు.

దోచుకోవడానికే స్కిల్ పథకం

- షెల్ కంపెనీలతో నగదుగా మార్పిడి
- చట్టాలకు చంద్రబాబు అతీతుడా?
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పేరుతో దోచుకోవడానికే నాడు చంద్రబాబు స్కీమ్ పెట్టి, షెల్ కంపెనీల ద్వారా నగదుగా మార్చుకున్నారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. దేశంలోని చట్టాలకు చంద్రబాబు అతీతుడా?, అన్ని ఆధారాలతోనే ఆయన్ని అరెస్టు చేశామన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంపై సంబంధిత ఆధారాలను, నాటి ప్రభుత్వం జారీజేసిన ఉత్తర్వులను పవర్ పాయింట్ ప్రజెం టేషన్ ద్వారా విలేకరులకు వివరించారు. సజ్జల మాట్లాడుతూ ఈ స్కిల్ కుంభకోణం జాతీయ, అంతర్జాతీయ దర్యాప్తు సంస్థలకు కేస్ స్టడీగా ఉపయోగపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రూ.371 కోట్ల ప్రజల డబ్బును దోచుకున్నారని మండిపడ్డారు. ఈ స్కీమ్ పేరుతో రాష్ట్ర ఖజానాకు వందల కోట్లాది రూపాయల నష్టం వాటిల్లిందని, ఆ సొమ్ము చంద్రబాబుకు చేరిందని బలమైన ఆధారాలున్నాయని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అవినీతి వ్యవహారం, అడ్డగోలు జీవోలను వివరించారు. యువత పేరు చెప్పి అడ్డగోలుగా దోచుకున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు అరెస్టుతో ఆయనను హింసిస్తు న్నారంటూ చేస్తున్న గ్లోబెల్ ప్రచారాన్ని సజ్జల తిప్పికొట్టారు. అన్ని ఆధారాలతోనే చంద్రబాబును సీఐడీ అరెస్టు చేసిందని స్పష్టం చేశారు. 2014లో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, దానిని 2015లో స్కిల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌గా మార్చారని తెలిపారు. గంటా సుబ్బారావు అనే వ్యక్తిని దీనికి ఎండీగా నియమిం చారని, అనంతరం నాలుగు నెలల్లోనే అప్పటి సీఎం చంద్ర బాబుకు ఎక్స్అఫిషియల్‌గా ఎదిగేలా ఆయన్ని ప్రోత్సహిం చారన్నారు. ఆ తర్వాత ఆయనను ఉన్నత విద్యామండలి కార్యదర్శిగాను నియమించారని వివరించారు. అసలు ఒప్పందమే జరగలేదని సీమెన్స్ కంపెనీ చెప్పింద న్నారు. షెల్ కంపెనీల ద్వారా వందల కోట్ల రూపాయలు కొల్లగొట్టారని, ఈడీ సైతం హవాలా వ్యవహారంపై విచారించిందన్నారు. చంద్రబాబును హింసిస్తున్నారంటూ టీడీపీ అసత్య ప్రచారం చేయడాన్ని తప్పుపట్టారు. దొంగలను పట్టుకుంటే ఎందుకంత హడావుడీ చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ కుట్ర, అవినీతికి చంద్రబాబే సూత్రధారిగా ఉన్నారని, ఆయన అధ్వర్యంలో జరిగిందనడానికి అనేక బలమైన ఆధారాలున్నాయని చెప్పారు. చంద్రబాబుకు తెలియదని తప్పించుకోవడానికి వీల్లేదని, ఆ దిశగా ఐఏఎస్ అధికారులు ఇచ్చిన నోట్ ఫైళ్లు ఉపయోగపడతాయని స్పష్టం చేశారు. లోకేశ్ పీఏలు ఇతర దేశాలకు పరారయ్యారన్నారు. దీనిని తప్పుదోవ పట్టించేలా దుష్ప్రచారం చేస్తే తప్పులు ఒప్పులు కావని, వారంతా ప్రజల్లో విశ్వాసం కోల్పోతారని చెప్పారు.

ఉపాధ్యాయులపై చిన్నచూపు తగదు : ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల వేతనాలపై ఇంకెంతకాలం వేచి చూడాలి?, వారిపై చిన్న చూపు తగదని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న తెలిపారు. ఈ మేరకు బుధవారం మంగళగిరిలోని నిధి భవన్ నందు విద్యాశాఖ సంయుక్త సంచాలకులు మువ్వ రామలింగాన్ని కలిసి రాష్ట్ర వ్యాప్త ఉపాధ్యాయుల క్యాడర్ స్ట్రెంత్ గురించి, పెండింగ్ వేతనాలపై చర్చించారు. అనంతరం వివిధ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయుల ఆవేదన, ఆక్రందన అర్థం చేసుకోవడంలో అధికారులు వైఫల్యం చెందారన్నారు. నాలుగు నెలలుగా వారికి పెండింగ్ వేతనాలు అందక నానా ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు.

చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా

టీడీపీ సామూహిక దీక్షలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు నియోజకవర్గ ప్రధాన కేంద్రాల్లో సామూహిక రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. 'బాబుతో నేను' పేరుతో నిర్వహించిన రిలే నిరాహార దీక్ష కార్యక్రమాన్ని కేంద్ర కార్యాలయం వద్ద టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు తదితరులు ప్రారంభించగా... రాష్ట్రవ్యాప్తంగా సామూహిక రిలేదీక్షలు చేపట్టారు. నల్ల జెండాలు పట్టుకొని 'సైకో పోవాలి - సైకిల్ రావాలి', 'డౌన్ డౌన్ జగన్' అంటూ నినాదాలతో హోరెత్తించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో కుట్రలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకుల దీక్ష శిబిరాన్ని జనసేన, సీపీఐ, సీపీఎం, లోక్ సత్తా, ఎమ్మార్పీఎస్, జైబీం పార్టీ నాయకులు సందర్శించి సఖీభావం తెలియజేశారు. దీక్షశిబిరం వద్ద ఏర్పాటు చేసిన బోర్డులో సామాన్య ప్రజలు చంద్రబాబు అరెస్టుపై తమ అభిప్రాయాలను తెలియజేశారు. చంద్రబాబు త్వరగా జైలు నుంచి విడుదల కావాలని కోరుతూ కొన్ని నియోజకవర్గాల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. అనేక ప్రాంతాల్లో రిలే నిరాహార దీక్షలను కూడా పోలీసులు అడ్డుకున్నారు. టీడీపీ నేతలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. కొందరిని గృహనిర్బంధం చేశారు. అయినప్పటికీ టీడీపీ నేతలు పోలీస్ నిర్బంధాలను తప్పించుకుని తమ నిరసనలను కొనసాగించారు. సాలూరులో ఒక కార్యకర్త గుండు గీసుకుని నిరసన తెలిపారు. విశాఖలో టీడీపీ నాయకుల అధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నిరసన తెలుపుతున్న గంటా శ్రీనివాసరావును హౌస్ అరెస్ట్ చేశారు. రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి, పల్లా శ్రీనివాస్‌ను పోలీసులు అడ్డుకున్నారు. పాలకొల్లులో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడును మూడు రోజుల నుంచి గృహ నిర్బంధం చేయగా... తప్పించుకొని రిలే నిరహారదీక్షలో పాల్గొన్నారు. పొద్దుటూరులో చంద్రబాబు జైలు నుంచి విడుదల కావాలని ప్రార్థిస్తూ టీడీపీ నేత ప్రవీణ్ కుమార్ రెడ్డి తన నివాసం నుంచి తిరుమలకు పాదయాత్రగా వెళ్లారు.

వర్సిటీ యాజమాన్యం వేధింపులు

రాష్ట్రపతికి జేఎన్‌యూ ప్రొఫెసర్ లేఖ

న్యూఢిల్లీ: యూనివర్సిటీ యాజమాన్యం తనను వేధిస్తోందంటూ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) ప్రొఫెసర్ రాజీవ్ కుమార్ రాష్ట్రపతికి లేఖ రాశారు. తనపై దాఖలైన దుష్ప్రవర్తన ఫిర్యాదుతో 42 నెలలుగా యాజమాన్యం వేధింపులకు గురిచేస్తోందని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఈ తరహా కేసుల్లో నెలలోపు విచారణ పూర్తి చేయాలని యూనివర్సిటీ నిబంధనలు ఉన్నప్పటికీ... 2020 ఫిబ్రవరి నుండి విచారణ పెండింగ్‌లో ఉంది. యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ సిస్టమ్స్ సైన్సెస్‌లో అధ్యాపక సభ్యుడు, ప్రొఫెసర్ రాజీవ్ తనపై పెండింగ్‌లో ఉన్న విచారణను ప్రస్తావిస్తూ తన పదవీ విరమణ అనంతర ప్రయోజనాలు నిలిపివేస్తారని భయాన్ని వ్యక్తంచేశారు. రాజీవ్ కుమార్ 2024 మార్చిలో పదవీ విరమణ చేయనున్నారు. 2006లో ఐఐటీ ఖరగ్‌పూర్‌లో తన పదవీకాలంలో ఆర్థిక, విధానపరమైన అక్రమాలను వెలికితీసి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (జేఈఈ)లో పారదర్శకతను తీసుకురావడానికి ఆయన చేసిన కృషికి సుప్రీంకోర్టు 'గుర్తింపు కోరని హీరో' అంటూ ప్రశంసలు కురిపించింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చైర్మన్ ఎం.జగదీశ్ కుమార్ 2015లో జేఎన్‌యూ వైస్‌ఛాన్సలర్‌గా ఉన్న సమయంలోనే ప్రొఫెసర్ రాజీవ్ కుమార్ అక్కడ చేరారు. 2020లో విచారణకు ఆదేశించగా, జగదీశ్ కుమార్ (2016-22) పదవీకాలం పూర్తయినా విచారణ కొనసాగుతుండటం గమనార్హం. 2006లో జేఈఈలో అక్రమాలు వెలికితీసినందుకు జగదీశ్ కుమార్ తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. గతేడాది జనవరిలో ఆయన పదవీవిరమణ చేసినప్పటికీ... తనపై వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు. 2020 జనవరిలో జరిగిన బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశంలో ఇద్దరు ఎక్స్‌టర్నల్ నిపుణులతో అనుచితంగా ప్రవర్తించినట్లు ప్రొఫెసర్ రాజీవ్ కుమార్‌పై ఆరోపణలు వచ్చాయి. తమపై వ్యక్తిగత ఆరోపణలు చేశారని ఆ ఇద్దరు ఫిర్యాదు చేశారు. అయితే వీరిలో ఒకరు ఫిర్యాదును వెనక్కుతీసుకున్నారని రాజీవ్ కుమార్ తెలిపారు. మరొకరు రిటైర్డ్ సభ్యుడని, ఆ సమావేశానికి హాజరయ్యేందుకు అతనికి అర్హత లేదని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి చాలాసార్లు లేఖలు రాసినా సమాధానం రాలేదని అన్నారు. ఈ విషయంపై స్టేటస్ రిపోర్ట్ కోరుతూ అవసరమైన చర్య కోసం రాష్ట్రపతి తన లేఖను విద్యా శాఖ, యూనివర్సిటీ యాజమాన్యానికి పంపినట్లు రాష్ట్రపతి కార్యాలయం పేర్కొందని అన్నారు. రాష్ట్రపతి నుండి సమాధానం కోసం వేచి చూస్తున్నానని ఆయన తెలిపారు.

'బిశ్వశర్మ' అవినీతి బాగోతం

- అసోం సీఎం కుటుంబ సంస్థకు రూ.10కోట్ల కేంద్ర సబ్సిడీ
- అవాస్తవమన్న హిమంత - ఆధారాలు చూపిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: అసోం ముఖ్యమంత్రి హిమంతా బిశ్వశర్మ కుటుంబ అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. ఆయన కుటుంబానికి సంబంధించిన ప్రముఖ మీడియా సంస్థకు రూ.10కోట్ల సబ్సిడీని కేంద్రం ఇచ్చింది. దీనిపై రాజకీయంగా దుమారం రేగింది. సొంత వారికి లాభాలు చేకూర్చేడమే కాషాయ పార్టీ పని, సన్నిహితులకు ఎంతైనా దోచిపెట్టగలదని కాంగ్రెస్ సహా విపక్షాలు తీవ్రస్థాయిలో విమర్శించాయి. బీజేపీ నేత బిశ్వశర్మ కుటుంబానికి ఊడిగం చేసినట్లు ఆరోపించాయి. ఈ ఆరోపణలను అసోం సీఎం తోసిపుచ్చారు. తన కుటుంబానికి కేంద్రం నుంచి ఎలాంటి సబ్సిడీ లభించలేదని చెప్పారు. దీనికి కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. నిరాధార ఆరోపణలు చేయబోమని చెప్పింది. సంబంధిత పత్రాలను విడుదల చేసింది. ప్రైడ్ ఈస్ట్ ఎంటర్‌టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ అనే మీడియా కంపెనీకి 2022, నవంబరు 10న రూ.25.88 కోట్ల విలువ చేసే ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టు కోసం సబ్సిడీని కేంద్రం ఇచ్చినట్లు అసోంకు చెందిన క్రాస్ కరెంట్ అనే వార్తాసంస్థ నివేదించింది. ఈ కంపెనీ హిమంతా బిశ్వశర్మ భార్య రింకీ భుయన్ శర్మ, తల్లి మృణాళిని దేవి, ఆయన తనయుడు నందిల్ బిశ్వశర్మ, కుమార్తె సుకన్య శర్మ అధ్వర్యంలో కొనసాగుతోంది. ఈశాన్య ప్రాంతంలోని ప్రముఖ వార్తాసంస్థల్లో ఒకటిగా ప్రైడ్ ఈస్ట్ ఉంది. రెండు టీవీ వార్తాఛానళ్లు, వార్తాపత్రిక, వెబ్‌సైట్, మూడు ఎంటర్‌టైన్మెంట్ ఛానళ్లు ఈ సంస్థకు ఉన్నాయి. నూలు ఉత్పత్తి, ఫుడ్ ప్రాసెసింగ్‌తో పాటు మీడియా వెంచర్లనూ ఈ కంపెనీ చేపడుతోంది. కేంద్రం తరపున రూ.10కోట్ల సబ్సిడీ ఈ కంపెనీకి లభించిన అంశాన్ని అసోం ఎమ్మెల్యే అఖిల్ గొగోయ్ రాష్ట్ర అసెంబ్లీలో లేవనెత్తారు. దీనిపై కాంగ్రెస్ నేతలు స్పష్టత కోరారు. బుధవారం ఎక్స్ మాధ్యమంగా బిశ్వశర్మ స్పందిస్తూ 'నా భార్య కంపెనీకి ఎలాంటి సబ్సిడీలు కేంద్రం నుంచి రాలేదని మళ్లీ చెబుతున్నా' అని పేర్కొన్నారు. అయితే రింకి భుయన్ శర్మ లబ్ధిదారుగా రూ.10కోట్ల సబ్సిడీని ఆగ్రో ప్రాసెసింగ్ క్లస్టర్ స్కీమ్ కోసం కేంద్రం అందించినట్లు చూపే పత్రాలను కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ వెలుగులోకి తెచ్చారు. ఆధారాలు ఉన్నప్పటికీ బిశ్వశర్మ దానిని అంగీకరించకుండా మొండిగా వ్యవహరించారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ నేత గౌరవ్ వల్లభ్ మండిపడ్డారు. 'ఏమి ఐడియా సర్‌జీ! వ్యవసాయ భూమిని కొని దానిని పారిశ్రామిక భూమిగా మార్చారా! కేంద్రం నుంచి రూ.10కోట్ల సబ్సిడీ పొందారా...' అని ఎద్దేవా చేశారు. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న ప్రధాని హామీలోని డొల్లతనం బయల్పడిందని విమర్శించారు. ప్రభుత్వ పథకాల ద్వారా బీజేపీ సన్నిహితులు మాత్రమే లబ్ధి పొందుతున్నారని స్పష్టమైందని దుయ్యబట్టారు. 'నా ఖావూంగా, నా ఖానే దూంగా' (నేను అక్రమ సొమ్ము తినను... ఎవరినీ తిననివ్వను) అంటే ఇదేనా అని ఎద్దేవాచేశారు. అవినీతి ఆరోపణలను అసోం ముఖ్యమంత్రి ఎదుర్కో వడం ఇది మొదటిసారి కాదు. 2022 జూన్‌లోనూ ఆయనపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. మహమ్మారి వేళ శానిటైజర్లు, పీపీఈ కిట్లను మార్కెట్ ధర కంటే చాలా ఎక్కువకు సీఎం కుటుంబ కంపెనీ విక్రయించినట్లు ఆరోపణలు వచ్చిన విషయం విదితమే.

మరో వివాదంలో అశోకా వర్సిటీ

న్యూఢిల్లీ: రాజకీయ, ఎన్నికల సమాచార కేంద్రాన్ని తొలగించడం ద్వారా అశోకా యూనివర్సిటీ మరో వివాదంలో చిక్కుకుంది. త్రివేది సెంటర్ ఫర్ పొలిటికల్ డేటా (టీసీపీడీ) రద్దు, ఆ సెంటర్ వ్యవస్థాపక డైరెక్టర్, అధ్యాపకుడు గిల్లెస్ వెర్నియర్స్ తొలగింపు దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. తొలగించింది. వర్సిటీ తాజా చర్యను ఎన్నికల కమిషన్ మాజీ చీఫ్ ఎస్‌వై ఖురేషీ, క్రిస్టోఫ్ జాఫ్రలాట్ సహా అధ్యయనవేత్తలు, నిపుణులతో కూడిన సైంటిఫిక్ బోర్డ్ తీవ్రంగా ఖండించింది. ఇదే క్రమంలో ఓ బహిరంగ లేఖ రాసింది. ప్రజాస్వామ్యం, ఎన్నికల నిర్వహణపై బలమైన సాక్ష్యం అవసరమని లేఖ పేర్కొంది. టీసీపీడీ భారత ఎన్నికలపై సమగ్రమైన, అత్యాధునిక విశ్లేషణతో కూడిన నాణ్యమైన సమాచారాన్ని అందించిందని తెలిపింది. త్రివేది సెంటర్ డైరెక్టర్‌ను తొలగించారని, టీసీపీడీ భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకున్నారని వెల్లడించింది. వర్సిటీ సైంటిఫిక్ బోర్డుతో చర్చించకుండా ఇదంతా జరగడంపై సభ్యులు లేఖలో విచారం వ్యక్తంచేశారు. ఏడేళ్లలో టీసీపీడీకి చెందిన నిపుణులు, అధ్యయనవేత్తలు 16 అంశాలపై క్షేత్రస్థాయి సమాచారాన్ని అందించారని, 20 రీసెర్చ్ ప్రాజెక్టులు చేపట్టారని, 80 రీసెర్చ్ సెమినార్లు నిర్వహించారని, 20 రీసెర్చ్ పేపర్స్, పుస్తకాలను ప్రచురించారని వెల్లడించారు. రెండు కీలక సదస్సులనూ నిర్వహించారన్నారు.

అన్ని కార్లకు ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు తప్పనిసరి కాదు

కేంద్ర రవాణా శాఖ మంత్రి గడ్కరీ



న్యూఢిల్లీ: అన్ని కార్లకు ఆరు ఎయిర్‌బ్యాగ్‌లను తప్పనిసరి చేయడం ప్రభుత్వానికి ఇష్టం లేదని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం అన్నారు. ఆరు ఎయిర్‌బ్యాగ్‌ల సదు పాయాన్ని తప్పనిసరి చేయాలన్న తన మునుపటి వైఖరిని పక్కనపెట్టి మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది అక్టోబరు ఒకటి నుంచి కొత్త నిబంధనలు అమలులోకి తీసుకు వస్తున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది. దిల్లీలో ఏర్పాటు చేసిన ఏఎంసీ కార్యక్రమంలో గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది కొత్త క్రాష్ టెస్ట్ నిబంధనలను అమలు చేసిన తర్వాత కార్లలో ఆరు ఎయిర్ బ్యాగుల నిబంధనలు అమలులోకి తీసుకు వస్తామన్నారు. దేశంలోని అనేక వాహన తయారీ సంస్థలు ఇప్పటికే తమ కార్లలో ఆరు ఎయిర్ బ్యాగ్‌లను అందిస్తున్నాయని చెప్పారు. కంపెనీలు సైతం ప్రచారం చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం వినియోగదారులకు సైతం భద్రతపై అవగాహన పెరిగిందని, ఈ క్రమంలో ఆరు ఎయిర్ బ్యాగ్‌లను అందించే వాహనాలకు డిమాండ్ పెరిగిందని తెలిపారు. అయితే గత ఏడాది కేంద్ర మంత్రి కొత్త ప్యాసింజర్ కార్లలో ఆరు ఎయిర్ బ్యాగ్‌లను తప్పనిసరి చేస్తున్నట్లు ప్రకటించారు. కారు ముందు సీటులో కూర్చొన్న వారేకాకుండా వెనుక సీటులో కూర్చున్న వారు సైతం సురక్షితంగా ఉండాలన్న ఉద్దేశంతో సరికొత్త నిబంధనలు తీసుకువస్తున్నట్లు కేంద్రమంత్రి ప్రకటించారు. మంగళవారం కూడా డీజిల్ వాహనాలపై అదనంగా జీఎస్‌టీని విధించనున్నట్లు కేంద్ర మంత్రి ఒక కార్యక్రమంలో ప్రకటించారు. ఈవీ వాహనాలను ప్రోత్సహిస్తూ కాలుష్యాన్ని విడుదల చేసే డీజిల్ కార్లపై అదనంగా 10 శాతం జీఎస్టీ పెంచాలని ఆర్థిక శాఖ మంత్రికి ప్రతి పాదనలు అందజేస్తామంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దాంతో దేశీయ స్టాక్ మార్కెట్లలో ఆటోరంగ షేర్లు భారీగా పతనమయ్యాయి. ఆ తర్వాత స్పందించిన కేంద్ర మంత్రి ఇప్పటికిప్పుడే డీజిల్ ఇంజిన్ వాహనాలపై జీఎస్టీని విధించే ఆలోచన, ప్రతిపాదన ఏదీ లేదని వివరణ ఇచ్చారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.